సాక్షి అనంతపురం

గురువారం । 21 । డిసెంబర్ । 2023



త్వరలో బైపాస్ సర్జరీ, గ్యాస్ట్రో సేవలు

అనంతపురం సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రిలో బైపాస్ సర్జరీ, గ్యాస్ట్రో ఎంటరాలజీ సేవలు త్వరలో అందుబాటులోకి రానున్నాయి. 8లో



టమాట కిలో రూ.18

కక్కలపల్లి మండీలో బుధవారం కిలో టమాట గరిష్ట ధర రూ.18 పలికింది. కనిష్టం రూ.6.50, సరాసరి రూ.12 ప్రకారం క్రయ విక్రయాలు జరిగాయి.

గరిష్టం/కనిష్టం
31.6°/16.8°

జిల్లా అంతటా బుధవారం పగలు, రాత్రి ఉష్ణోగ్రతలు స్థిరంగా నమోదయ్యాయి. ఉదయం చలి తీవ్రత పెరిగింది. ఆగ్నేయం దిశగా గాలులు గంటకు 6 నుంచి 8 కిలో మీటర్ల వేగంతో వీచాయి.

న్యూస్‌రీల్

'ఆడుదాం ఆంధ్రా' పకడ్బందీగా నిర్వహించాలి



వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న కలెక్టర్ గౌతమి, చిత్రంలో డీఆర్‌ఓ గాయత్రీదేవి

అనంతపురం అర్బన్: రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా చేపట్టిన 'ఆడుదాం ఆంధ్రా' కార్యక్రమాన్ని జిల్లాలో పకడ్బందీగా నిర్వహించాలని కలెక్టర్ గౌతమి అధికారులను ఆదేశించారు. 'ఆడుదాం ఆంధ్రా'పై ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి బుధవారం తాడేపల్లిలోని తన క్యాంపు కార్యాలయం నుంచి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షించారు. కాన్ఫరెన్స్ అనంతరం అధికారులతో కలెక్టర్ సమావేశం నిర్వహించారు. ఈ నెల 26న 'ఆడుదాం ఆంధ్రా' ప్రారంభించేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమం కింద రిజిస్ట్రేషన్ ప్రక్రియను వేగవంతం చేయాలన్నారు. క్రీడా నైపుణ్యం కలిగిన యువతను గుర్తించాలన్నారు. ప్రతి సచివాలయం పరిధిలో అన్ని ఆటలకు సంబంధించి కనీసం రెండు జట్లు ఎంపిక చేయాలని చెప్పారు. మహిళా క్రీడాకారుల నమోదు చేపట్టాలన్నారు. ఎంపీడీఓలు, మునిసిపల్ కమిషనర్లు దీనిపై ప్రత్యేక దృష్టి సారించాలని ఆదేశించారు.

కూలీల బ్యాంకు ఖాతాలకు ఆధార్ లింక్

అనంతపురం టౌన్: ఉపాధి హామీ పథకం జాబ్‌కార్డు ఉన్న కూలీలు బ్యాంకు ఖాతాలను ఆధార్‌తో అనుసంధానం చేసుకోవాలని జిల్లా నీటియాజమాన్య సంస్థ (డ్వామా) ప్రాజెక్టు డైరెక్టర్ వేణుగోపాల్‌రెడ్డి తెలిపారు. ఈ మేరకు ఆయన బుధవారం ఒక ప్రకటన విడుదల చేశారు. వచ్చే ఏడాది జనవరి ఒకటి నుంచి ఉపాధి పనులకు వచ్చే కూలీలకు ఆధార్ అనుసంధానం లేకపోతే వేతనం బ్యాంకు ఖాతాలో జమ కాదని స్పష్టం చేశారు. ఫీల్డ్ అసిస్టెంట్లు ఉపాధి కూలీలకు బ్యాంక్ ఖాతా ఆధార్ అనుసంధానంపై అవగాహన కల్పించాలని సూచించారు.

నెలాఖరులోపు ఈ-క్రాప్ పూర్తి చేయాలి



మాట్లాడుతున్న డీఏఓ ఉమామహేశ్వరమ్మ

అనంతపురం అగ్రికల్చర్: రబీ పంటల సాగు ఈ-క్రాప్, ఈ-కేవైసీ ప్రక్రియ నెలాఖరులోపు పూర్తి చేయాలని జిల్లా వ్యవసాయ శాఖ అధికారి (డీఏఓ) ఉమామహేశ్వరమ్మ ఏఓలను ఆదేశించారు. బుధవారం నగరంలోని కృషి భవన్‌లో ఏడీఏ రవితో కలిసి డీఏఓ అనంతపురం వ్యవసాయ సబ్ డివిజన్ ఏఓలు, ఆర్‌బీకే అసిస్టెంట్లతో సమావేశం నిర్వహించారు. ప్రధానంగా ఈ-క్రాప్ పురోగతిపై మండలాల వారీగా ఆరా తీశారు. ఆర్‌బీకేల్లో అవసరమైనంత మేరకు ఎరువులు అందుబాటులో పెట్టాలని ఆదేశించారు. రబీలో రైతులు ఆరుతడి పంటలు సాగు చేసేలా అవగాహన కల్పించాలని సూచించారు. పొలంబడి ఇతర పథకాల ప్రగతిపై సమీక్షించి గడువులోగా పూర్తి చేయాలన్నారు.

కొత్త ఓటర్లకు కార్డులు పంపిస్తాం

అనంతపురం అర్బన్: ప్రత్యేక ఓటరు సవరణ కార్యక్రమంలో కొత్తగా నమోదైన వారందరికీ ఓటరు ఫొటో గుర్తింపు (ఎపిక్) కార్డులను పోస్టు ద్వారా పంపిస్తామని కలెక్టర్ గౌతమి రాజకీయ పార్టీల ప్రతినిధులకు తెలిపారు. క్లెయిమ్‌లు, అభ్యంతరాలను పారదర్శకంగా పరిష్కరిస్తున్నామని చెప్పారు. ఓటరు జాబితా సవరణపై కలెక్టర్ బుధవారం కలెక్టరేట్ మినీ కాన్ఫరెన్స్ హాల్‌లో డీఆర్‌ఓ గాయత్రీదేవితో కలిసి రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశం నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ కొత్తగా ఓటరుగా నమోదైన వారిలో ఇప్పటి వరకు జిల్లాకు 19,209 ఎపిక్ కార్డులు వచ్చాయన్నారు. పూర్తిస్థాయిలో వచ్చిన తరువాత వాటిని ప్రతి ఓటరుకూ స్పీడ్ పోస్ట్ ద్వారా పంపిస్తామన్నారు. ఇక క్లెయిమ్‌ల పరిష్కారంపై ప్రత్యేక దృష్టి సారించామన్నారు. ప్రతి దరఖాస్తునూ మూడంచెల పరిశీలన అనంతరం పరిష్కరిస్తున్నామని చెప్పారు. ముఖ్యంగా ఓటు తొలగింపు (ఫారం-7) దరఖాస్తులపై సూక్ష్మస్థాయి పరిశీలన నిర్వహిస్తున్నామన్నారు. అధికారులు, సిబ్బంది ఏ దశలోనూ చిన్నపాటి తప్పిదానికి తావివ్వకుండా చర్యలు తీసుకున్నామన్నారు. సమావేశంలో పార్టీల ప్రతినిధులు కేవీ రమణ, పవన్‌కుమార్, ఇమామ్, శ్యాంసుందర్, బాల రంగయ్య, రామాంజనేయులు, ఎన్నికల సెల్ తహసీల్దార్ భాస్కర్, డీటీ కనకరాజు తదితరులు పాల్గొన్నారు.

సర్కారు ఉన్నత సంకల్పం

- జగనన్న విదేశీ విద్యా దీవెన, సివిల్ సర్వీసెస్ ప్రోత్సాహక సొమ్ము విడుదల
- విద్యార్థులు, యువత సద్వినియోగం చేసుకోవాలని కలెక్టర్ గౌతమి, జెడ్పీ చైర్‌పర్సన్ గిరిజమ్మ పిలుపు



లబ్ధిదారులతో కలసి మెగా చెక్కు విడుదల చేస్తున్న కలెక్టర్ గౌతమి, జెడ్పీ చైర్‌పర్సన్ గిరిజమ్మ, ఏడీసీసీ బ్యాంక్ చైర్‌పర్సన్ లిఖిత, ఆర్టీసీ జోనల్ చైర్‌పర్సన్ మంజుల , అధికారులు

అనంతపురం అర్బన్: ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ, అగ్రవర్ణ కులాల విద్యార్థులకు ఉన్నత చదువులు చదువుకునే అవకాశం కల్పించి, వారు అత్యున్నత స్థానాల్లో స్థిరపడేందుకు జగనన్న ప్రభుత్వం తోడ్పాటునందిస్తోంది. ప్రతిభ ఉన్న వారు ఆర్థిక పరిస్థితుల కారణంగా చదువును మధ్యలో ఆపకూడదని, వారు కన్న కలను సాకారం చేసుకోవడానికి, ఎంచుకున్న లక్ష్యం చేరుకోవడానికి చేయూతనందిస్తోంది. ప్రపంచ అత్యున్నత శ్రేణి యూనివర్సిటీల్లో విద్యనభ్యసించేందుకు 'జగనన్న విదేశీ విద్యా దీవెన' ద్వారా బాటలు వేసింది. సివిల్స్ సాధనలో భాగంగా సన్నద్ధమయ్యే క్రమంలో కోచింగ్, స్టడీ మెటీరియల్‌కు 'జగనన్న సివిల్ సర్వీసెస్ ప్రోత్సాహకం' కింద ఆర్థిక సహకారంతో వెన్నుతట్టి ప్రోత్సహిస్తోంది. జగన్ సర్కారు ఉన్నత సంకల్పానికి అనుగుణంగా విద్యార్థులు, యువత చదువు- ఉద్యోగాల్లో రాణించాలని కలెక్టర్ గౌతమి, జెడ్పీ చైర్‌పర్సన్ బోయ గిరిజమ్మ పిలుపునిచ్చారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి బుధవారం తాడేపల్లిలోని క్యాంపు కార్యాలయం నుంచి 'జగనన్న విదేశీ విద్యాదీవెన పథకం, జగనన్న సివిల్ సర్వీసెస్ ప్రోత్సాహకం కింద అర్హులైన వారికి ఆర్థిక సహాయాన్ని అందించే కార్యక్రమాన్ని ప్రారంభించారు. కంప్యూటర్ బటన్ నొక్కి లబ్ధిదారుల ఖాతాల్లోకి ఫీజు రీయింబర్స్‌మెంట్ మొత్తాన్ని, సివిల్స్ మెయిన్స్‌కు సన్నద్ధమవుతున్న అభ్యర్థులకు ఆర్థిక సహాయాన్ని జమ చేశారు. కలెక్టరేట్ నుంచి కలెక్టర్, జెడ్పీ చైర్‌పర్సన్‌తో పాటు ఆర్టీసీ జోనల్ చైర్‌పర్సన్ మంజుల, ఏడీసీసీ బ్యాంక్ చైర్‌పర్సన్ లిఖిత, అధికారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా జిల్లా నుంచి సివిల్స్ ప్రిలిమినరీ పరీక్షలో పాసై మెయిన్స్‌కు అర్హత సాధించిన ఏడుగురు అభ్యర్థుల (జవహర్ చంద్రదీప్ -ఎస్సీ, వరుణ్‌కుమార్ నాయక్ -ఎస్టీ, గురుసాయి మంజునాథ్ -ఈబీసీ, మనీషా -ఓసీ, అనిల్ కుమార్‌రెడ్డి -ఈబీసీ, ఓంకుమార్‌రెడ్డి -కాపు, మధుసూదన్ -బీసీ)కు ఒకొక్కరికి రూ.లక్ష చొప్పున మొత్తం రూ.7లక్షల ఆర్థికసాయం మంజూరైంది. అలాగే 'జగనన్న విదేశీ విద్యా దీవెన' కింద ఎంపికైన ఐదుగురు విద్యార్థులకు రూ.54,40,142 ఫీజు రీయింబర్స్‌మెంట్ మంజూరైంది. రెండు పథకాలకు సంబంధించి రూ.61,40,142 మెగాచెక్కును విడుదల చేశారు. సివిల్స్ మెయిన్స్‌కు సన్నద్ధమవుతున్న అభ్యర్థులను అభినందించారు. కలెక్టర్, జెడ్పీ చైర్‌పర్సన్ మాట్లాడుతూ పేద, మధ్యతరగతి వర్గాల్లోని విద్యాకుసుమాలకు ఉన్నత విద్యను అందించి వారికి భవిష్యత్తుకు సీఎం జగన్ బంగారు బాట వేస్తున్నారన్నారు. సివిల్ సర్వీసెస్‌కు సన్నద్ధమవుతున్న విద్యార్థులు ప్రభుత్వమందించిన ఆర్థిక తోడ్పాటును సద్వినియోగం చేసుకుని లక్ష్యం చేరుకోవాలని పిలుపునిచ్చారు. అధికారులు పాల్గొన్నారు.

చాలా సంతోషంగా ఉంది



మాది మధ్య తరగతి కుటుంబం. మా అమ్మాయి కె.శ్రీప్రియ యూకేలోని యూనివర్సిటీ ఆఫ్ గ్లాస్‌గోలో కార్డియో వాస్కులర్ సైన్స్‌లో ఎంఎస్ చేస్తోంది. జగనన్న విదేశీ విద్యాదీవెన పథకం కింద ప్రభుత్వం మా అమ్మాయికి రూ.21,65,665 ఫీజు రీయింబర్స్‌మెంట్ కల్పించింది. మొదటి విడత కింద రూ.10,82,833 ఇచ్చింది. ఇప్పుడు రెండో విడత కింద రూ.5,42,416 మంజూరైంది. చాలా సంతోషంగా ఉంది.

– ఉమామహేశ్వరి, శ్రీనివాసరావు (శ్రీప్రియ తల్లిదండ్రులు)

ప్రోత్సాహంతో లక్ష్యం సాధిస్తా



మాది మధ్యతరగతి కుటుంబం. మా నాన్నకు మెడికల్ షాపు ఉంది. సివిల్స్ సాధించాలనే పట్టుదలతో కష్టపడి చదివి ప్రిలిమ్స్ పాసయ్యాను. మెయిన్స్‌కు ప్రిపేర్ కావడం అంటే ఖర్చుతో కూడుకున్నది. మా కుటుంబానికి అంత ఆర్థిక స్థోమత లేదు. అయితే మేము మెయిన్స్ ప్రిపేర్ అయ్యేందుకు ప్రభుత్వ పరంగా రూ.లక్ష ఆర్థిక సహాయం అందిస్తున్న ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డికి రుణపడి ఉంటాం.

– గురుసాయి మంజునాథ్, గుత్తి ఆర్ఎస్

సీఎం జగన్‌కు ధన్యవాదాలు



మాది వ్యవసాయ కుటుంబం. ఆర్థిక పరిస్థితి అంతంత మాత్రమే. సివిల్స్ సాధించాలనే పట్టుదలతో ప్రిలిమనరీ పరీక్షలో ఉత్తీర్ణత సాధించా. ఇక మెయిన్స్‌కు ప్రిపేర్ కావాలంటే స్టడీ మెటీరిల్, కోచింగ్ ఇలా అన్నీ ఖర్చుతో కూడుకున్నవే. ఈ పరిస్థితుల్లో మెయిన్స్ ప్రిపేర్ అయ్యేందుకు 'జగనన్న సివిల్ సర్వీసెస్ ప్రోత్సాహకం' కింద రూ.లక్ష ఆర్థిక సహాయాన్ని కల్పించిన ముఖ్యమంత్రి ధన్యవాదాలు తెలియజేసుకుంటున్నా.

– వరుణ్ కుమార్ నాయక్, పంపనూరు, ఆత్మకూరు మండలం

విద్య విలువ తెలిసిన సీఎం



సివిల్స్ ప్రిలిమనరీ పాసై మెయిన్స్‌కు సిద్ధమవుతున్న నా లాంటి పేద అభ్యర్థికి రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశ పెట్టిన 'జగనన్న సివిల్ సర్వీసెస్ ప్రోత్సాహకం' గొప్ప వరం. ఈ పథకం కింద మెయిన్స్ ప్రిపరేషన్ కోసం రూ.లక్ష ఆర్థిక సహాయం అందించడం సంతోషంగా ఉంది. విద్య విలువ తెలిసిన గొప్ప సీఎం మనకు ఉండడం రాష్ట్రం చేసుకున్న అదృష్టం.

– ఓంకుమార్‌రెడ్డి, నార్పల

శాస్త్రీయ దృక్పథం అలవరుచుకోవాలి

- రాష్ట్రస్థాయి కౌశల్ పోటీలకు 15 మంది ఎంపిక



విజేతలను అభినందిస్తున్న అధికారులు

అనంతపురం ఎడ్యుకేషన్: విద్యార్థులు శాస్త్రీయ దృక్పథం అలవరచుకోవాలని డీఈఓ వి.నాగరాజు కోరారు. విజ్ఞాన భారతి సంస్థ ఆధ్వర్యంలో బుధవారం విద్యార్థులకు జిల్లాస్థాయి కౌశల్ క్విజ్-2023 పోటీలు అనంతపురం సైన్స్ సెంటర్‌లో నిర్వహించారు. 36 పాఠశాలల నుంచి క్విజ్ టీములు, 40 పాఠశాలల నుంచి పోస్టర్ టీములు పాల్గొన్నాయి. ప్రతిభ కనబరచిన 15 మందిని రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక చేశారు. ముఖ్య అతిథిగా హాజరైన డీఈఓ నాగరాజు మాట్లాడుతూ ఇలాంటి పోటీలు విద్యార్థులకు చాలా ఉపయోగకరంగా ఉంటాయన్నారు. విజేతలను అభినందిస్తూనే రాష్ట్రస్థాయిలో ప్రతిభ చాటి జిల్లాకు మంచిపేరు తేవాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో కౌశల్ జిల్లా సమన్వయకర్త బి.రాము, కౌశల్ రాష్ట్ర విద్యా సమన్వయకర్త ఆనందభాస్కర్‌రెడ్డి, అదనపు జిల్లా సమన్వయకర్త రామచంద్ర, సైన్స్ సెంటర్ క్యూరేటర్ బాలమురళీ కృష్ణ, హెచ్‌ఎంలు అజంతుల్లా, రాజశేఖర్‌రెడ్డి పాల్గొన్నారు. కాగా విజేతలు ఈ నెల 30న విజయవాడలో జరిగే రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొంటారు.

విజేతలు వీరే..

- క్విజ్ పోటీల్లో ఉరవకొండ ఎస్కే ప్రభుత్వ పాఠశాల విద్యార్థులు ఎస్.యోగేశ్వర్, ఉదయ్‌శేఖర్, ఎండీ అక్మల్ ప్రథమ బహుమతి, యాడికి జెడ్పీహెచ్‌ఎస్ విద్యార్థులు పి.వెంకటేష్, బి.తరణి, పి.అనిల్‌కుమార్ ద్వితీయ, తాడిపత్రి ఏపీ మోడల్ స్కూల్ విద్యార్థులు ఎం.ఇస్తియాక్, డి.జస్వంతిక, జి.హేమచరణ్ తృతీయ బహుమతులకు ఎంపికయ్యారు.
- పోస్టర్ జనరల్ పోటీల్లో ఆత్మకూరు జెడ్పీహెచ్‌ఎస్ విద్యార్థిని ఎస్.భార్గవి ప్రథమ, గుత్తి కోట జెడ్పీహెచ్‌ఎస్ విద్యార్థిని ఎస్.బెన్నీ ద్వితీయ, ములకలేడు జెడ్పీహెచ్‌ఎస్ విద్యార్థిని ఎన్.స్నేహలత తృతీయ బహుమతికి ఎంపికయ్యారు.
- పోస్టర్ స్పెషల్ పోటీల్లో హనకనహాళ్ జెడ్పీహెచ్‌ఎస్ విద్యార్థి పి.గణేష్‌రెడ్డి ప్రథమ, బొమ్మనహాళ్ జెడ్పీహెచ్‌ఎస్ విద్యార్థిని వి.అనూష ద్వితీయ, శనగలగూడూరు జెడ్పీహెచ్‌ఎస్ విద్యార్థిని ఎన్.వర్షితరెడ్డి తృతీయ బహుమతులకు ఎంపికయ్యారు.

నేడు సీఎం జన్మదిన వేడుకలు

అనంతపురం కార్పొరేషన్: సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి జన్మదిన వేడుకలను గురువారం ఉదయం 9.30 గంటలకు వైఎస్సార్‌సీపీ జిల్లా కార్యాలయంలో నిర్వహిస్తున్నట్లు ఎమ్మెల్యే అనంత వెంకటరామిరెడ్డి తెలిపారు. కేక్ కటింగ్ కార్యక్రమం ఉంటుందన్నారు. 10.15 గంటలకు జెడ్పీ కార్యాలయం వద్ద దివంగత వైఎస్సార్ విగ్రహానికి పుష్పాంజలి ఘటిస్తారు. 10.30 గంటలకు ప్రభుత్వ సర్వజనాస్పత్రిలోని రోగులకు పండ్లు, బ్రెడ్లు పంపిణీ జరుగుతుందన్నారు. పార్టీ శ్రేణులు హాజరుకావాలని పిలుపునిచ్చారు.

23న సన్నాహక సమావేశం

అనంతపురంలో ఈ నెల 29న సామాజిక సాధికార బస్సు యాత్ర జరగనుంది. యాత్ర నిర్వహణపై ఈ నెల 23న నగరంలోని సాయినగర్‌లో ఉన్న యాపిల్ గార్డెన్స్‌లో సన్నాహక సమావేశం ఏర్పాటు చేసినట్లు ఎమ్మెల్యే అనంత వెంకటరామిరెడ్డి తెలిపారు. వివిధ కార్పొరేషన్ల చైర్మన్లు, డైరెక్టర్లు, వైఎస్సార్‌సీపీ నాయకులు హాజరు కావాలని కోరారు.

తరగని విద్యానిధి ఏబీసీ

- అకడమిక్ బ్యాంక్ ఆఫ్ క్రెడిట్‌తో ఉపయోగాలెన్నో..
- ఆన్‌లైన్‌లో ఎప్పుడైనా.. ఎక్కడైనా కోర్సులు చేసుకోవచ్చు
- ఏబీసీలో భద్రపరిచిన క్రెడిట్‌లు 40 శాతం వరకు బీటెక్, ఎంటెక్ కోర్సులకు వర్తింపు
- అనంతపురం పరిధిలో 52 వేల మంది విద్యార్థుల రిజిస్ట్రేషన్ పూర్తి



అనంతపురం: నగదు లావాదేవీలకు బ్యాంకులు, ఖాతాలు ఉన్నట్లే.. చదువులో ఎన్ని కోర్సులు పూర్తి చేశామనే కొలమానం వేయడానికి ప్రత్యేక బ్యాంక్, ఖాతాలు ఉన్నాయి. ఏబీసీ (అకడమిక్ బ్యాంక్ ఆఫ్ క్రెడిట్) పేరుతో అకడమిక్ బ్యాంక్ ఖాతాను ప్రతి విద్యార్థీ ప్రారంభించాల్సిన అనివార్య పరిస్థితులు ఏర్పడ్డాయి. ఇందులో పూర్తి చేసిన కోర్సులు అత్యంత ప్రామాణికంగా ఉండడంతో పాటు ప్రపంచంలో ఎక్కడి నుండైనా ఈ ఖాతాను పరిశీలించి ప్రతిభను అంచనా వేయవచ్చు. బహుళ జాతి సంస్థ (మల్టీ నేషనల్ కంపెనీ)లో కొలువు దక్కించుకోవాలనుకుంటే విద్యార్థి ఏబీసీ ఖాతాను పరిశీలిస్తే చాలు. విద్యార్థి నైపుణ్యం, ప్రతిభ, అర్హత అన్ని అంశాలూ పసిగట్టవచ్చు. జేఎన్‌టీయూ అనంతపురం ఉన్నతాధికారులు గతేడాది నుంచి ఈ విధానాన్ని అమలులోకి తెచ్చారు. గతేడాది 20 వేల మంది విద్యార్థులు రిజిస్ట్రేషన్ చేసుకోగా, ఈ ఏడాది 52 వేల మంది విద్యార్థులు అకడమిక్ బ్యాంక్ ఆఫ్ క్రెడిట్‌లో రిజిస్ట్రేషన్ చేసుకోవడం విశేషం.

విద్యార్థి ప్రతిభకు తార్కాణం

నాణ్యమైన బోధన - అభ్యసనా ప్రక్రియను పెంపొందించడానికి యూజీసీ (యూనివర్సిటీ గ్రాంట్స్ కమిషన్)-2021 మార్గదర్శకాలకు అనుగుణంగా ఏబీసీని ఏర్పాటు చేశారు. పరిశ్రమల ఆధారిత సిలబస్‌ను విద్యార్థి అభ్యసించడానికి వీలుగా ఇలాంటి విధానాన్ని అమల్లోకి తెచ్చారు. కోర్సు చదివే సమయంలో విద్యార్థి పరిశ్రమకు వెళ్లి అనుభవం గడించిన అనంతరం తిరిగి కోర్సులోకి ప్రవేశించవచ్చు. పరిశ్రమలో పని చేసే సమయంలో ఆన్‌లైన్ విధానంలో నేర్చుకున్న కోర్సులు ఏబీసీలో నమోదు చేసుకోవచ్చు. అయితే ఆన్‌లైన్ కోర్సుకు తప్పనిసరిగా సర్టిపై అయిన సంస్థల నుంచి సర్టిఫికెట్ ఉండాలి. ఇలా మొత్తం 40 శాతం ఆన్‌లైన్ కోర్సులను పరిగణనలోకి తీసుకుంటారు. బీటెక్‌లో మొత్తం 163 క్రెడిట్లు ఉండగా, ఇందులో 40 శాతం క్రెడిట్‌లు ఏబీసీలో నమోదైన ఆన్‌లైన్ విధానంలో పూర్తి చేయొచ్చు. ఎంటెక్ మొత్తం 95 క్రెడిట్‌లు ఉండగా 40 శాతం ఆన్‌లైన్ విధానంలో పూర్తి చేసే వెసులుబాటు ఉంది.

ఎప్పటికప్పుడు క్రెడిట్స్ లెక్కింపు

జేఎన్‌టీయూ అనంతపురం పరిధిలో మొత్తం 90 ఇంజినీరింగ్ కళాశాలలు ఉన్నాయి. ప్రతి విద్యార్థికి అకడమిక్ బ్యాంక్ అకౌంట్ (ఏబీఏ)ను అందజేస్తున్నారు. యూనిక్ ఐడీ, పాస్‌వర్డ్ సాయంతో ఏబీసీ ఖాతాను తెరవచ్చు. విద్యార్థి ఏ కోర్సునైనా అభ్యసించవచ్చు. ఎప్పటికప్పుడు క్రెడిట్స్ లెక్కిస్తారు. విద్యార్థి సాధించిన క్రెడిట్లు 9 సంవత్సరాల కాల పరిమితి వరకు చెల్లుబాటు అవుతాయి. తొమ్మిదేళ్ల తరువాత తిరిగి కొత్త కోర్సులు అభ్యసించాల్సి ఉంటుంది. అప్పటి దాకా ఉన్న పాత కోర్సులు రద్దు చేస్తారు. జేఎన్‌టీయూ రిజిస్ట్రార్‌సి.శశిధర్, ఎవాల్యుయేషన్స్ డైరెక్టర్ కేశవరెడ్డి ఆధ్వర్యంలో ఏబీసీ ఖాతాను అందుబాటులోకి తెచ్చేందుకు చర్యలు తీసుకుంటున్నారు.

వినూత్న కోర్సులు అభ్యసించే వీలు



ఏబీసీ (అకడమిక్ బ్యాంక్ ఆఫ్ క్రెడిట్)ప్రతి విద్యార్థికీ కీలకమైనది. అంతర్జాతీయస్థాయి నిపుణులు అందించే కోర్సులు అభ్యసించడానికి దోహదపడే అత్యుత్తమ ప్లాట్‌ఫాం ఇది. ఏబీసీలో వీలైనంత ఆన్‌లైన్ కోర్సులు డిపాజిట్ చేసుకోవాలి. పరిశ్రమల అవసరాలకు తగ్గట్టుగా ఎప్పటికప్పుడు ఆన్‌లైన్ విధానంలో నూతన కోర్సులు పూర్తి చేసుకునే వెసులుబాటు ఉంటుంది.

–ప్రొఫెసర్ జింకా రంగజనార్దన, వీసీ, జేఎన్‌టీయూ అనంతపురం

జగన్ జన్మదిన సంబరం



సీఎం జగన్ కటౌట్‌కు క్షీరాభిషేకం



భారీ కేక్ కట్ చేస్తున్న మహాలక్ష్మి శ్రీనివాస్, ఎర్రిస్వామి రెడ్డి, వైవీ శివారెడ్డి, రంగంపేట గోపాల్‌రెడ్డి తదితరులు



అనంతపురంలో మహాలక్ష్మి శ్రీనివాస్ ఆధ్వర్యంలో భారీ బైక్ ర్యాలీ

అనంతపురం కార్పొరేషన్: సంక్షేమ రథ సారథి, ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి జన్మదిన వేడుకలు అనంతపురంలో అంబరమంటాయి. బుధవారం అనంతపురం - హిందూపురం అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ (అహుడా) చైర్మన్ మహాలక్ష్మి శ్రీనివాస్ ఆధ్వర్యంలో వైఎస్సార్‌సీపీ శ్రేణులు భారీ బైక్ ర్యాలీ నిర్వహించారు. శ్రీనగర్ కాలనీలోని మహాలక్ష్మి శ్రీనివాస్ నివాసం వద్ద ర్యాలీ ప్రారంభమైంది. రావాలి జగన్.. కావాలి జగన్.. హ్యాపీ బర్త్‌డే సీఎం సార్ అంటూ చేసిన నినాదాలు ప్రతిధ్వనించాయి. రాంనగర్ ఫ్లై ఓవర్ సర్కిల్, రుద్రంపేట, కళ్యాణదుర్గం బైపాస్, బళ్లారి బైపాస్ నుంచి క్లాక్‌టవర్ మీదుగా లలితకళా పరిషత్ వరకు ర్యాలీ సాగింది. ఈ సందర్భంగా అక్కడ ఏర్పాటు చేసిన 60 అడుగుల జగన్ కటౌట్‌కు క్రేన్ సహాయంతో గజమాల వేసి.. క్షీరాభిషేకం చేశారు. తర్వాత భారీ కేక్ కట్ చేసి సంబరాలు చేసుకున్నారు. 'నవరత్నాలు' పేరిట పేదల కుటుంబాల్లో వెలుగులు నింపిన సీఎం జగన్ పుట్టిన రోజు వేడుక నిర్వహించడం సంతోషంగా ఉందని మహాలక్ష్మి శ్రీనివాస్ అన్నారు. జగన్ పాలనలోనే రాష్ట్రం సుభిక్షంగా ఉంటుందన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ సీనియర్ నేత బి.ఎర్రిస్వామిరెడ్డి, నాయకులు వైవీ శివారెడ్డి, పెన్నోబులేసు, రంగంపేట గోపాల్‌రెడ్డి, పుల్లయ్య, ఆదినారాయణ, చలపతి, చందన, సుబ్బయ్య, భాను, హరీష్‌రెడ్డి, నారాయణపురం రామకృష్ణారెడ్డి, గోపాల్, సాధిక్, చంద్రశేఖర్‌రెడ్డి, మనోజ్, వైఎస్సార్‌సీపీ మైనార్టీ విభాగం రాష్ట్ర నాయకులు నియాజ్, ఖాజా తదితరులు పాల్గొన్నారు.

క్రికెట్ కిట్ అందజేత

భారత విభిన్న ప్రతిభావంతుల క్రికెట్ జట్టులో సభ్యులైన వసంత్‌కుమార్, అన్వేష్, మునిస్వామిరెడ్డిలకు అహుడా చైర్మన్ మహాలక్ష్మి శ్రీనివాస్ క్రికెట్ కిట్ అందజేశారు. విభిన్న ప్రతిభావంతులు క్రీడల్లో రాణించి దేశానికి పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు.

జీజీహెచ్‌లో కోవిడ్ వార్డు సిద్ధం

అనంతపురం కార్పొరేషన్: కోవిడ్ కొత్త రూపాంతరం విస్తరిస్తుండడంతో జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అప్రమత్తమైంది. ప్రభుత్వ ఆదేశాలతో సర్వజనాస్పత్రిలో 30 పడకల సామర్థ్యంతో ప్రత్యేక వార్డును వైద్యాధికారులు ఏర్పాటు చేశారు. పల్మనాలజీ హెచ్‌ఓడీ డాక్టర్ రామస్వామిని నోడల్ ఆఫీసర్‌గా నియమించారు. మాస్కులు, శానిటైజర్లు, వెంటిలేటర్లు, ఆక్సిజన్ సిద్ధంగా ఉంచారు.



క్లుప్తంగా

మినీ లారీ దగ్ధం

బొమ్మనహాళ్: మండలంలోని ఉద్దేహాళ్ సమీపంలో వరి కోత మిషన్‌కు సంబంధించిన అశోక్ లైలాండ్ మినీ లారీ విద్యుత్ షార్ట్ సర్క్యూట్ కారణంగా కాలిపోయింది. కర్ణాటకలోని కంప్లికి చెందిన వరి కోత మిషన్‌ను మినీ లారీ ద్వారా బుధవారం బొమ్మనహాళ్‌కు తీసుకువచ్చారు. కోతమిషన్‌ను కిందకు దించి డీజిల్ కోసం మినీ లారీలో వెళుతుండగా ఉద్దేహాళ్ శివారులోకి చేరుకోగానే ఇంజిన్ నుంచి మంటలు చెలరేగాయి. డ్రైవర్ అప్రమత్తమై వెంటనే వాహనాన్ని ఆపి కిందకు దిగాడు. ఇంతలో ఒక్కసారిగా మంటలు ఎగిసిపడ్డాయి. స్థానికులు మంటలను అదుపు చేసేలోపు మినీ లారీ ముందు భాగం పూర్తిగా దగ్ధమైంది. దాదాపు రూ.3.5 లక్షల వరకు నష్టం వాటిల్లినట్లు బాధితుడు బాలరాజు తెలిపారు.

మాజీ సైనికోద్యోగి మృతి



నివాళులర్పిస్తున్న మాజీ సైనికులు

అనంతపురం క్రైం: జిల్లా మాజీ సైనికుల సంఘం కార్యవర్గ సభ్యుడు, మాజీ సైనికోద్యోగి వి.శ్రీనివాసులు (75) బుధవారం తెల్లవారుజామున అనంతపురంలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ కన్ను మూశారు. 17 ఏళ్ల పాటు భారత పదాతి దళంలో ఎన్నో విలువైన సేవలను అందించిన ఆయన 1971లో జరిగిన పాకిస్తాన్‌తో యుద్ధంలోనూ పాల్గొన్నారు. ఉద్యోగ విరమణ అనంతరం ఆంధ్రా బ్యాంక్‌లో క్లర్క్‌గా చేరి మేనేజర్ స్థాయిలో 1984లో ఉద్యోగ విరమణ పొందారు. 2015 నుంచి మాజీ సైనికుల సంఘంలో క్రియాశీలకంగా పనిచేస్తూ వచ్చారు. విషయం తెలుసుకున్న మాజీ సైనికుల సంఘం నేతలు, మాజీ సైనికులు... శ్రీనివాసులు పార్థివదేహానికి జాతీయ జెండా కప్పి నివాళులర్పించారు. కార్యక్రమంలో రంగారెడ్డి, కెప్టెన్ షేకన్న, కెప్టెన్ ఉమామహేశ్వరరావు పాల్గొన్నారు.

పెట్రోలు బంకులో చోరీ



దుండగుల చేతిలో గాయపడ్డ రాజశేఖర్

రాప్తాడు: మండలంలోని రామినేపల్లి వద్ద 44వ జాతీయ రహదారిపై ఉన్న పెట్రోల్ బంక్ (చెన్నకేశవ ఫిల్లింగ్ స్టేషన్)లో దుండగులు చొరబడి నగదు అపహరించుకెళ్లారు. పోలీసులు తెలిపిన మేరకు.. మంగళవారం రాత్రి పెట్రోల్ బంక్‌లో అనంతపురానికి చెందిన పవన్‌కుమార్, ప్రసాద్, శ్రీసత్యసాయి జిల్లా ధర్మవరం నివాసి రాజశేఖర్ విధుల్లో ఉన్నారు. బుధవారం వేకువజాము 2 గంటలకు పవన్‌కుమార్, రాజశేఖర్ నిద్రిస్తుండగా ప్రసాద్ మేల్కొని ఉన్నాడు. ఆ సమయంలో ముగ్గురు వ్యక్తులు మాస్క్‌లు ధరించి చేతుల్లో కట్టెలు పట్టుకుని పెట్రోల్ బంక్‌లోకి చొరబడ్డారు. ఆ సమయంలో వారి చొరబాటును ప్రసాద్ అడ్డుకోగా గొడవ చోటు చేసుకుంది. దీంతో పవన్‌కుమార్, రాజశేఖర్ నిద్రలేచి ఆగంతకులను నిలువరించే ప్రయత్నం చేయడంతో అప్పటికే తమ వద్ద సిద్ధంగా ఉంచుకున్న కారం తీసి ముగ్గురి కళ్లలోకి చల్లారు. అనంతరం రూ.28 వేలు అపహరించుకుని వెళుతుండగా పవన్ కుమార్, రాజశేఖర్, ప్రసాద్ ఎదురు దాడికి దిగారు. దీంతో కట్టెలతో విచ్చలవిడిగా దాడి చేసి దుండగులు అక్కడి నుంచి పారిపోయారు. ఘటనలో రాజశేఖర్ తలకు తీవ్ర రక్త గాయమైంది. విషయం తెలుసుకున్న సీఐ నరేంద్రరెడ్డి, సిబ్బంది వెంటనే అక్కడకు చేరుకుని ఘటనపై ఆరా తీశారు. సీసీ పుటేజీలను పరిశీలించారు. ఘటనపై పవన్‌కుమార్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టినట్లు పోలీసులు తెలిపారు.

పవర్ ప్రాజెక్టుపై రేపు ప్రజాభిప్రాయ సేకరణ

యాడికి: కమలపాడు పంచాయతీలో కొత్తరాయుడుస్వామి దేవాలయ సమీపాన 900 ఎకరాల్లో 950 మెగావాట్ల విద్యుత్ ఉత్పత్తి చేసే పవర్ ప్రాజెక్టుపై శుక్రవారం ప్రజాభిప్రాయ సేకరణ నిర్వహించనున్నట్లు తహసీల్దార్ రాజ్ కుమార్ తెలిపారు.

అంతర్రాష్ట్ర దొంగ అరెస్ట్

- 23 తులాల బంగారు, 2 కిలోల వెండి స్వాధీనం

అనంతపురం క్రైం : తాళం వేసిన ఇళ్లను లక్ష్యంగా చేసుకుని చోరీలకు తెగబడే అంతర్రాష్ట్ర దొంగను అనంతపురం త్రీటౌన్, గుంతకల్లు, సీసీఎస్ పోలీసులు సంయుక్తంగా అరెస్ట్ చేశారు. వివరాలను బుధవారం జిల్లా పోలీసు కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఎస్పీ అన్బురాజన్ వెల్లడించారు. మహారాష్ట్రలోని సోలాపూర్ జిల్లా పండరీపురంలోని నౌరంగి ఆశ్రమం నుంచి వచ్చిన లికన్ అశోక్ కులకర్ణి అలియాస్ సచిన్ మానే ఓ అనాథ. పలు చోరీ కేసుల్లో పాత నేరస్తుడు. ఏపీతో పాటు తెలంగాణ, మహారాష్ట్ర, కర్ణాటక, గుజరాత్ రాష్ట్రాల్లో 80కి పైగా దొంగతనాల కేసుల్లో ప్రధాన నిందితుడు. ఇతను రాత్రి పూట తాళం వేసిన ఇళ్లలో చొరబడి చోరీలకు పాల్పడేవాడు. కర్ణాటకలోని మూడు కేసుల్లో పట్టుబడి శిక్షలు కూడా అనుభవించాడు. ఇతనిపై పలు వారంట్లు పెండింగ్‌లో ఉన్నాయి. ఈ క్రమంలోనే ఆయా రాష్ట్రాల పోలీసుల కళ్లుగప్పి అనంతపురానికి చేరకున్న సచిన్ మానే.. గుంతకల్లు, అనంతపురం, ఆలూరు ప్రాంతాల్లో చోరీలు చేశాడు. తాజాగా గుంతకల్లుతో పాటు అనంతపురం మూడో పట్టణ పోలీసు స్టేషన్ పరిధిలో జరిగిన చోరీలపై విచారణ చేపట్టిన పోలీసులు పక్కా ఆధారాలతో బుధవారం అనంతపురం రైల్వే స్టేషన్ వద్ద సచిన్ మానేను అరెస్ట్ చేశారు. నిందితుడి నుంచి రూ.15 లక్షలు విలువ చేసే 23 తులాల బంగారు నగలతో పాటు రెండు కిలోల వెండి సామగ్రిని స్వాధీనం చేసుకున్నారు. నిందితుడి అరెస్ట్‌లో చొరవ చూపిన సిబ్బందిని ఈ సందర్భంగా ఎస్పీ అభినందించారు.



స్వాధీనం చేసుకున్న సొత్తును పరిశీలిస్తున్న ఎస్పీ అన్బురాజన్

ముగ్గురు విద్యార్థుల డీబార్

అనంతపురం: శ్రీకృష్ణదేవరాయ విశ్వవిద్యాలయం యూజీ ఐదో సెమిస్టర్ పరీక్షల్లో ముగ్గురు విద్యార్థులు మాస్‌కాపీయింగ్‌కు పాల్పడుతూ పట్టుబడడంతో డీబార్ చేసినట్లు డైరెక్టర్ ఆఫ్ ఎవాల్యుయేషన్స్ ప్రొఫెసర్ జీవీ రమణ తెలిపారు. కళ్యాణదుర్గం, గుత్తి, అనంతపురంలో ఒక్కొక్కరు చొప్పున మాస్‌కాపీయింగ్‌కు పాల్పడడంతో పట్టుబడినట్లు పేర్కొన్నారు.

జేసీపీఆర్, అస్మిత్‌పై కేసు నమోదు

పెద్దవడుగూరు: ఎలాంటి అనుమతులు లేకుండా బుధవారం ఉదయం పెద్దవడుగూరు మండలం మిడుతూరు వద్ద 44వ జాతీయ రహదారిపై మాజీ ఎమ్మెల్యే జేసీ ప్రభాకరరెడ్డి, ఆయన తనయుడు జేసీ అస్మిత్‌రెడ్డి ధర్నా నిర్వహించడంపై పోలీసులు కేసు నమోదు చేశారు. 30 పోలీసు యాక్ట్‌ను ఉల్లంఘించి వాహనాల రాకపోకలకు అంతరాయం కల్పిస్తూ ప్రజలను ఇబ్బందులకు గురిచేయడంతో ఐపీసీ 188, 341 సెక్షన్ల కింద కేసు నమోదు చేసినట్లు సీఐ శంకరరెడ్డి, ఎస్ఐ శ్రీనివాసులు తెలిపారు. శాంతి భద్రతలకు విఘాతం కలిగిస్తే ఎంతటి వారినైనా ఉపేక్షించబోమన్నారు.

జనవాక్కు

నమ్మలేకపోతున్నాం



కళ్యాణదుర్గం మున్సిపాలిటీ పరిధిలోని ఒంటిమిద్దిలో నివసిస్తున్న మేము జగనన్న పాలనలో పూర్తి సంతృప్తితో ఉన్నాం. గతంలో ఏ ప్రభుత్వమూ ఇంతలా పేదలను ఆదుకున్నది లేదు. ఇదంతా నమ్మలేక పోతున్నాం. నాకైతే అమ్మ ఒడి, వైఎస్సార్ పంటల బీమా, సున్నావడ్డీ, వైఎస్సార్ రైతు భరోసా ద్వారా పూర్తి లబ్ధి చేకూరింది. పిల్లలకు మంచి చదువులను అయ్యవార్లు చెబుతున్నారు. కుటుంబంలో ఆర్థిక ఇబ్బందులు దూరమయ్యాయి. మా లాంటి పేదలు సంతోషంగా జీవిస్తున్నారంటే దానికి కారణం సీఎం జగనన్న. ఆయనకు మేమెంతో రుణపడి ఉంటాం.

– పి.గౌరి, గృహిణి, ఒంటిమిద్ది

ఊర్లోనే వైద్యం



ఏదైనా జబ్బు బారిన పడితే కిలోమీటర్ల దూరంలో ఉన్న మండల కేంద్రంలోని పీహెచ్‌సీకి వెళ్లేవాళ్లం. ముఖ్యమంత్రిగా వైఎస్ జగన్ బాధ్యతలు తీసుకున్న తర్వాత మా ఊళ్లోనే నాణ్యమైన వైద్య సేవలు పొందుతున్నాం. అన్ని రకాల వైద్య పరీక్షలూ ఇక్కడే నిర్వహిస్తున్నారు. జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమంలో రూ.1,500 విలువ చేసే వైద్య పరీక్షలు ఉచితంగా చేశారు. అంతేకాక మందులూ ఉచితంగానే ఇచ్చారు. నిజంగా సీఎం వైఎస్ జగన్ పాలన ఎంతో బాగుంది. మళ్లీ ఆయనే ముఖ్యమంత్రి కావాలని కోరుకుంటున్నా.

– బాబు, నిజవళ్లి, కుందుర్పి మండలం

సంక్షేమ పథకాలు అందాయి



గత ప్రభుత్వ హయాంలో కుల, ఆదాయ ధ్రువీకరణ పత్రాలు లేకపోవడంతో సంక్షేమ పథకాలు పొందలేకపోయాను. ఇక విసిగి ధ్రువీకరణ పత్రాల కోసం వెంపర్లాడడం మానేశాను. జగనన్న సురక్ష కార్యక్రమంలో దరఖాస్తు చేసుకున్న వెంటనే ఆ రెండు ధ్రువీకరణ పత్రాలను వలంటీర్ ఇంటి వద్దకే తీసుకొచ్చి ఇచ్చాడు. ఆ సర్టిఫికెట్ల ఆధారంగా వైఎస్సార్ చేయూత పథకానికి అర్హత సాధించా. కర్నూలులో బీటెక్ చదువుతున్న మా కుమార్తెకు జగనన్న విద్యాదీవెన పథకమూ వర్తించింది. వైఎస్సార్ ఆసరా ద్వారా నాకు మేలు జరిగింది. పైసా ఖర్చు లేకుండా మాకు ఇంటి వద్దకే సర్టిఫికెట్లు అందజేసి, ప్రభుత్వ పథకాల లబ్ధి చేకూర్చిన సీఎం వైఎస్ జగన్ మేలు మరువలేం.

– మంజుల, తాటాకుల వీధి, గుంతకల్లు

సిఫారసు లేకుండానే పింఛన్



గత ప్రభుత్వంలో వృద్ధాప్య పింఛన్ కోసం పలుమార్లు దరఖాస్తు చేసుకున్నా. జన్మభూమి కమిటీ నాయకులను ప్రాధేయపడినా ఫలితం దక్కలేదు. వైఎస్సార్ సీపీ అధికారంలోకి వచ్చిన తర్వాత సీఎం జగన్ ప్రవేశపెట్టిన వలంటీర్ వ్యవస్థతో నాకెంతో మేలు కలిగింది. ఎలాంటి సిఫారసు లేకుండానే వలంటీర్ నేరుగా నా వద్దకు వచ్చి వివరాలు, ధ్రువీకరణ పత్రాలు తీసుకెళ్లి పింఛన్ మంజూరయ్యేలా చేశాడు. ఇలాంటి గొప్ప సేవలు ఎన్నడూ చూడలేదు. మళ్లీ ఆయనే సీఎం కావాలి.

–తిరుపతయ్య, సీపీఐ కాలనీ, గుత్తి

ఆ స్కానింగ్ మిషన్ లక్ష్మీకాంతమ్మదే

- నిర్ధారించిన కమిషనర్ ఆఫ్ ఫ్యామిలీ వెల్ఫేర్
- డాక్టర్ లక్ష్మీకాంతమ్మకు నోటీసులిచ్చిన డీఎంహెచ్ఓ భ్రమరాంబదేవి

అనంతపురం మెడికల్: నగరంలోని రెవెన్యూ కాలనీలో అనధికారికంగా నిర్వహిస్తున్న స్కానింగ్ సెంటర్‌లోని స్కానింగ్ మిషన్ గైనకాలజిస్టు డాక్టర్ లక్ష్మీకాంతమ్మదేనని కమిషనర్ ఆఫ్ ఫ్యామిలీ వెల్ఫేర్ అధికారులు నిర్ధారించారు. దీంతో పులివెందుల వైద్య కళాశాలలో అసిస్టెంట్ ప్రొఫెసర్‌గా చేరనున్న డాక్టర్ లక్ష్మీకాంతమ్మకు డీఎంహెచ్ఓ డాక్టర్ భ్రమరాంబదేవి నోటీసు జారీ చేస్తూ ఆ కళాశాల ప్రిన్సిపాల్‌కు ఫిర్యాదు చేశారు.

ఇదీ సంగతి

రెవెన్యూ కాలనీలో ఎలాంటి విద్యార్హత, ఆరోగ్యశాఖ అనుమతుల్లేకుండా నిర్వహిస్తున్న స్కానింగ్ సెంటర్‌ను ఈ ఏడాది నవంబర్ 21న డీఎంహెచ్ఓ డాక్టర్ భ్రమరాంబదేవి సీజ్ చేసిన విషయం తెలిసిందే. ట్రాన్స్‌వాజినల్ అల్ట్రాసోనోగ్రఫీ విధానంలో లింగ నిర్ధారణ పరీక్షలు చేస్తున్నట్లు అప్పట్లో అధికారులు గుర్తించారు. దాదాపు 170 మంది గర్భిణులకు పరీక్షలు జరిపినట్లు తనిఖీలో వెల్లడైంది. దీంతో నిర్వాహకులు సునీల్‌కుమార్, శ్రావణిపై పీసీపీఎన్‌డీటీ చట్టం ఉల్లంఘన కింద కోర్టులో పిటీషన్ దాఖలు చేశారు. అదే సమయంలో వారు వినియోగిస్తున్న స్కానింగ్ మిషన్ ఎవరిదనేది నిగ్గు తేల్చాలంటూ కమిషనర్ ఆఫ్ ఫ్యామిలీ వెల్ఫేర్‌కు డీఎంహెచ్ఓ డాక్టర్ భ్రమరాంబదేవి విన్నవించారు. దీంతో కమిషనర్ ఆదేశాలతో రాష్ట్రాధికారులు చెన్నైకి చెందిన మిన్‌డ్రే కంపెనీ, విజయవాడలోని దివిస్ మీడియా సిస్టమ్/సర్వీసెస్‌ను విచారించగా డాక్టర్ లక్ష్మీకాంతమ్మ పేరు మీద అల్ట్రాసౌండ్ స్కానింగ్ మిషన్ కొనుగోలు చేసినట్లు స్పష్టమైంది. ఈ విషయం అనంతపురం ఆరోగ్యశాఖకు తెలియడంతో అందరూ నిర్ఘాంతపోయారు.



స్కానింగ్ సెంటర్‌ను సీజ్ చేస్తున్నట్లు నిర్వాహకుడికి తెలుపుతున్న డీఎంహెచ్ఓ డాక్టర్ భ్రమరాంబదేవి (ఫైల్)

ఆది నుంచి వివాదాస్పదమే

గైనకాలజిస్టు డాక్టర్ లక్ష్మీకాంతమ్మ తీరు ఆది నుంచి వివాదాస్పదంగానే ఉంటోంది. గతంలో అనంతపురంలోని శ్రీనివాసనగర్‌లో అభిజ్ఞ ఆస్పత్రిలో లక్ష్మీకాంతమ్మపై నమోదైన 14 ఫైళ్లు, మెడికల్ టర్మినేషన్ ఆఫ్ ప్రెగ్నెన్సీ చట్టాన్ని అతిక్రమించి 99 అబార్షన్లు చేయడం, ఎలాంటి అనుమతులు తీసుకోకుండా శ్రీనివాసనగర్‌లో రూత్ ఆస్పత్రి నిర్వహణపై అప్పటి డీఎంహెచ్ఓ డాక్టర్ వీరబ్బాయి, పీసీపీఎన్‌డీటీ యాక్ట్ జిల్లా నోడల్ ఆఫీసర్ డాక్టర్ యుగంధర్ ఇచ్చిన నివేదిక ఆధారంగా ఈ ఏడాది మే 27న ఆమెను కలెక్టర్ గౌతమి సస్పెన్షన్ చేశారు. ఇటీవల ఆమెకు తిరిగి పులివెందుల వైద్య కళాశాలకు పోస్టింగ్ వచ్చింది. కాగా, రెవెన్యూ కాలనీలో అనధికారిక స్కాన్ సెంటర్ నిర్వహించిన సునీల్‌కుమార్, శ్రావణిపై ఇప్పటికే ఆరోగ్య శాఖాధికారులు కోర్టులో పీసీపీఎన్‌డీటీ యాక్ట్ ఉల్లంఘన కింద ఫిల్ దాఖలు చేశారు. తాజాగా డాక్టర్ లక్ష్మీకాంతమ్మ పేరును చేర్చనున్నారు.

సీఎం జగన్‌తోనే సంక్షేమ విప్లవం



మురడిలో సచివాలయాన్ని ప్రారంభిస్తున్న విప్ కాపు రామచంద్రారెడ్డి

- వచ్చే ఎన్నికల్లో టీడీపీ ఓటమి ఖాయం
- విప్ కాపు రామచంద్రారెడ్డి

రాయదుర్గం(డి హీరేహాళ్): రానున్న ఎన్నికల్లో పేదలు, పెత్తందార్ల మధ్య ప్రధాన పోటీ ఉండబోతుందని ప్రభుత్వ విప్ కాపు రామచంద్రారెడ్డి అన్నారు. డి హీరేహాళ్ మండలంలోని మురడిలో బుధవారం గ్రామ సచివాలయం, రైతు భరోసా కేంద్రాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పేదల సంక్షేమం, అభివృద్ధికి ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి అహర్నిశలు పాటుపడుతున్నారని తెలిపారు. పెద్దల బాగు కోసం టీడీపీ అధ్యక్షుడు చంద్రబాబు కొమ్ముకాసేలా వ్యవహరిస్తున్నారని ధ్వజమెత్తారు. చంద్రబాబు ఏ పని చేసినా ఎల్లో మీడియా శభాష్ అంటూ చెప్పుకుంటున్నారన్నారు. జగన్ ఎన్ని మంచి పనులు చేసినా తప్పు పట్టడం సాధరణంగా మారిపోందన్నారు. రాష్ట్రంలో టీడీపీతో పాటు ఎల్లోమీడియాతో కూడా యుద్ధం చేయాల్సి వస్తోందన్నారు. ఈ దుష్టచతుష్టయం ఎంత దుష్ప్రచారం చేసినా ప్రజలు నమ్మే స్థితిలో లేరని స్పష్టం చేశారు. వచ్చే ఎన్నికల్లో టీడీపీ నామ రూపాల్లేకుండా తుడిచిపెట్టుకు పోతుందని జోస్యం చెప్పారు. టీడీపీ పోలిట్‌బ్యూరో సభ్యుడు కాలవ శ్రీనివాసులుకు ఓటమి భయం మొదలైందని ఆరోపించారు. డబ్బు చెల్లించి అన్ని ఆధారాలతో సహా నాపేరుపై ప్లాట్లు కొని రిజిస్ట్రేషన్ చేసుకుంటే లంచం కింద తీసుకున్నాడని ఆరోపణలు చేయడం సిగ్గుచేటన్నారు. డబ్బులిచ్చి స్థలం కొంటే నీ అబ్బాసొత్తేమైనా పోయిందా? అంటూ ఆగ్రహం వ్యక్తం చేశారు. కాలవ మంత్రిగా ఉంటూ కంత్రీ వ్యవహారాలకే పెద్దపీట వేశారన్నారు. టీడీపీ హయాంలో దోపిడీ చేసిన సొమ్ముతో విలాసవంతమైన కొంపలు కట్టుకుంది వాస్తవం కాదా..? అంటూ నిలదీశారు. బినామీ పేర్లతో కొనుగోలు చేసిన ఘనత కాలవ శ్రీనివాసులుకు దక్కుతుందన్నారు. టీడీపీ అధినేత చంద్రబాబు 420 అయితే ఈ మురికి కాలువ 840 అని అభివర్ణించారు. పేరుకే గొప్ప పదవులు అనుభవించారే తప్పా ప్రజలకు ఏ ప్రయోజనం వనగూరలేదన్నారు. అనంతరం బళ్లారి- రాయదుర్గం రహదారి మరమ్మతు పనులకు భూమిపూజ చేశారు. కార్యక్రమంలో సర్పంచ్ గంగప్ప, మార్కెట్‌యార్డ్ చైర్మన్ భోజరాజ్‌నాయక్, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ ఎం వన్నూర్‌స్వామి, జిల్లా ఉపాధ్యక్షుడు రాళ్ల తిమ్మారెడ్డి, ఆలయ కమిటీ చైర్మెన్ పద్మనాభరెడ్డి, పీఆర్ డీఈ రామమోహన్‌రెడ్డి, ఎంపీడీఓ బాస్కర్‌బాబు, డీటీ బసవకుమార్, వైఎస్సార్‌సీపీ జిల్లా స్టీరింగ్ కమిటీ సభ్యులు రవీంద్రానాథ్‌రెడ్డి, బీసీసెల్ అధ్యక్షులు పులకూర్తి చంద్ర, వివిధ గ్రామాల సర్పంచులు సుదర్శనరెడ్డి, బోయ మల్లికార్జున, శ్రీనివాసరెడ్డి, హనుమంతరెడ్డి, రుద్రేష్, పెద్ద ఆంజనేయులు, నాగరాజు, ఎంపీటీసీలు సురేష్, శివలింగ, గోవింద, ఎర్రిస్వామి పాల్గొన్నారు.

రోడ్డు మరమ్మతు పనులు ప్రారంభం

బొమ్మనహాళ్: చాలా కాలంగా నిర్లక్ష్యానికి గురైన గ్రామాలను అభివృద్ధి చేసి, నియోజకవర్గ రూపురేఖలు మారుస్తున్నామని ప్రభుత్వ విప్ కాపురామచంద్రారెడ్డి అన్నారు. బుధవారం మండలంలోని గోనేహాళ్ క్రాస్ నుంచి గోనేహాళ్, ఎస్ఆర్ఎస్ క్యాంపు, బెణికల్లు, బ్రహ్మసముద్రం గ్రామాల వరకూ రూ.1.5 కోట్లతో 11 కిలోమీటర్ల తారు రోడ్డు మరమ్మతు పనులను ప్రారంభించారు. ఆర్అండ్‌బీ డీఈఈ రవిశంకర్‌రెడ్డి, ఏఈఈలు సుష్మిజ, నాగేంద్ర ప్రసాద్, కన్వీనర్ రామాంజనేయులు, వైస్ ఎంపీపీ రమేష్, చంద్రశేఖర్‌రెడ్డి, వెంకటాక్షిపతిరెడ్డి, మాజీ ఎంపీపీ రాజగోపాల్‌రెడ్డి, మాజీ జెడ్పీటీసీ నాగిరెడ్డి, శ్రీకాంత్‌రెడ్డి, మనోహర్‌శెట్టి, రామకృష్ణ, ఆనంద్‌రెడ్డి పాల్గొన్నారు.

అద్దెకు ఆర్టీసీ స్థలాలు

అనంతపురం సెంట్రల్: జిల్లాలోని కళ్యాణదుర్గం, రాయదుర్గం పట్టణాల్లో ఏపీఎస్ ఆర్టీసీకి చెందిన ఖాళీ స్థలాలను 15 సంవత్సరాల కాల పరిమితికి అద్దెకు ఇవ్వనున్నారు. ఈ మేరకు జిల్లా ప్రజారవాణాధికారి సుమంత్.ఆర్.ఆదోని బుధవారం ఓ ప్రకటన విడుదల చేశారు. కళ్యాణదుర్గంలోని పావగడ రోడ్డుకు ఉన్న ఖాళీ స్థలాన్ని ఐదు భాగాలుగా విభజించారు. అలాగే రాయదుర్గంలోని అనంతపురం రోడ్డుకు ఉన్న 2,662 చదరపు గజాల స్థలాన్ని లీజుకు ఇవ్వనున్నారు. ఆసక్తి ఉన్న వారు ఈ నెల 27న వైఎస్సార్ జిల్లా కడపలోని ఎక్జిక్యూటివ్ డైరెక్టర్ కార్యాలయంలో టెండర్ దాఖలు చేయాలి. పూర్తి వివరాలకు ఏపీఎస్ఆర్టీసీ వెబ్‌సైట్‌ను పరిశీలించవచ్చు.

డీఆర్ఎం కార్యాలయ భవనానికి ఎనర్జీ కన్జర్వేషన్ అవార్డు

గుంతకల్లు: గుంతకల్లు డివిజనల్ రైల్వే మేనేజర్ కార్యాలయ భవనానికి ఎనర్జీ కన్జర్వేషన్ గోల్డ్ అవార్డు దక్కింది. ఈ మేరకు డీఆర్ఎం మనీష్ అగర్వాల్ బుధవారం తెలిపారు. స్టేట్ ఎనర్జీ కన్జర్వేషన్ అవార్డులను ఏటా ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వాలు అందజేయడం ఆనవాయితీగా వస్తోంది. ఈ క్రమంలో దక్షిణ మధ్య రైల్వే పరిధిలోని తెలంగాణలో ఐదు, ఆంధ్రప్రదేశ్‌లో రెండు అవార్డులు డీఆర్ఎం కార్యాలయ భవనం దక్కించుకుంది. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఇంధన పరిరక్షణ మిషన్, ఇంధన మంత్రిత్వశాఖ ఆధ్వర్యంలో బుధవారం విజయవాడలోని వివంత హోటల్‌లో జరిగిన కార్యక్రమంలో ఆంధ్రప్రదేశ్ సేట్ట్ ఎనర్జీ కన్జర్వేషన్ అవార్డును డీఆర్ఎం మనీష్ అగర్వాల్ అందుకున్నారు.



డీఆర్ఎం కార్యాలయ భవనం

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... ప్రణాళికాబద్ధంగా విద్యుత్ పొదుపు చేయడం ద్వారా అవార్డు దక్కినట్లు తెలిపారు. ఎలక్ట్రికల్ విభాగం అధికారులను రైల్వే జీఎం అరుణ్‌కుమార్‌జైన్ అభినందించారు.

వాలీబాల్ జట్టు ఎంపిక

అనంతపురం: ఈ నెల 22న కర్ణాటకలోని బెల్గాంలో ఉన్న విశ్వేశ్వరయ్య టెక్నాలజీ యూనివర్సిటీ వేదికగా జరిగే సౌత్ జోన్ ఇంటర్ యూనివర్సిటీల వాలీబాల్ టోర్నీలో ప్రాతినిధ్యం వహించే ఎస్కేయూ జట్టును బుధవారం ఎంపిక చేశారు. ఈ మేరకు స్పోర్ట్స్ సెక్రెటరీ ఎంవీ శ్రీనివాసన్ తెలిపారు. ఎంపికైన క్రీడాకారుల్లో బుక్కపట్నంలోని ఎస్ఎస్ఎస్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల విద్యార్థులు చాకలి సాయికిరణ్, షేక్ మన్సూర్ బాషా, కె.మహమ్మద్ హమీద్, పెనుకొండలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాల విద్యార్థి డి.మౌలాసాహెబ్, జగరాజుపల్లిలోని మంగళకర డిగ్రీ కళాశాల విద్యార్థులు బి.నజీర్‌హుస్సేన్, పి.అరవింద్, కె.కరుణాకర్, అనంతపురం ఆర్ట్స్ కళాశాల విద్యార్థులు తలారి సాయి భరత్‌కుమార్, ఎస్.పి.అజిత్ చక్రి, ఎస్వీ డిగ్రీ కళాశాల విద్యార్థి జి.రామకృష్ణ, ఎస్ఎస్‌బీఎన్ డిగ్రీ కళాశాల విద్యార్థులు కె.గణేష్, ఎ.శివానంద ఉన్నారు. ఎంపికైన క్రీడాకారులను ఎస్కేయూ ఇన్‌చార్జ్ వీసీ చింతా సుధాకర్ అభినందించారు.

ప్రజలను ఇబ్బంది పెట్టడంతోనే కేశవ్‌పై కేసు

ఉరవకొండ: అనంతపురం-బళ్లారి 42వ జాతీయ రహదారిపై బుధవారం ఎలాంటి అనుమతులు లేకుండా టీడీపీ నాయకులు రాస్తారోకో చేసి ప్రజలను ఇబ్బందులకు గురి చేశారు. దీంతో ఎమ్మెల్యే పయ్యావుల కేశవ్‌తో పాటు మరో 10 మందిపై కేసులు నమోదు చేశామని గుంతకల్లు డీఎస్పీ నర్సింగప్ప తెలిపారు. ఉరవకొండ రూరల్ సర్కిల్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఉరవకొండ అర్బన్, రూరల్ సీఐలు తిమ్మయ్య, ప్రవీణ్‌కుమార్‌తో కలిసి ఆయన మాట్లాడారు. జాతీయ రహదారిపై ఎలాంటి పోలీసు అనుమతులు తీసుకోకుండా ఎమ్మెల్యే కేశవ్ రాస్తారోకో చేశారని పేర్కొన్నారు. గంటల తరబడి వాహనాలు నిలిపి వేసి ట్రాఫిక్‌కు తీవ్ర అంతరాయం కల్గించారని తెలిపారు. రాస్తారోకో చేస్తూ రోడ్డుకు అడ్డంగా ట్రాక్టర్లు, ద్విచక్ర వాహనాలు నిలిపారని పేర్కొన్నారు. ఈ ఘటనకు బాధ్యులను చేస్తూ ఎమ్మెల్యే పయ్యావుల కేశవ్‌తో పాటు మరో పది మందిపై కేసు నమోదు చేశామన్నారు. కొన్ని పత్రికలు, చానల్స్‌లో రైతులపై కేసులు నమోదు చేసినట్లు వార్తలు వచ్చాయని.. అందులో వాస్తవం లేదని స్పష్టం చేశారు.



మాట్లాడుతున్న గుంతకల్లు డీఎస్పీ

27,28 తేదీల్లో క్రీడాపోటీలు

అనంతపురం: అనంతపురం స్పోర్ట్స్ ఫెడరేషన్ ఆఫ్ డెఫ్ అసోసియేషన్ ఆధ్వర్యంలో డిసెంబర్ 27,28 తేదీల్లో జూనియర్, సబ్ జూనియర్ స్పోర్ట్స్ గేమ్స్ ఫర్ ద డెఫ్ పోటీలు నిర్వహిస్తున్నట్లు ఆ సంఘం ప్రధాన కార్యదర్శి జి.సత్యనారాయణ రెడ్డి ఓ ప్రకటనలో తెలిపారు. బుక్కరాయసముద్రం మండలం సిద్దరాంపురం రోడ్డులోని ఆర్డీటీ బధిరుల ఉన్నత పాఠశాలలో ఉన్న స్టేడియంలో పోటీలు నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు.

త్వరలో బైపాస్ సర్జరీ, గ్యాస్ట్రో ఎంటరాలజీ సేవలు

అనంతపురం మెడికల్: అనంతపురం సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రిలో బైపాస్ సర్జరీ, గ్యాస్ట్రో ఎంటరాలజీ సేవలు త్వరలో అందుబాటులోకి రానున్నట్లు ప్రభుత్వ వైద్య కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ మాణిక్యరావు, సర్వజనాస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ కేఎస్ఎస్ వెంకటేశ్వరరావు తెలిపారు. నందికొట్కూరు సీహెచ్‌సీలో విధులు నిర్వర్తిస్తున్న డాక్టర్ సునీల్ కళ్యాణ్‌దేవ్ (కార్డియో థొరాసిక్ సర్జన్), గ్యాస్ట్రో ఎంటరాలజిస్టులు డాక్టర్ కోటి వెంకటేశ్వరరావు, డాక్టర్ నారాయణరెడ్డిలను ఇక్కడకు నియమించినట్లు పేర్కొన్నారు.



సాక్షి క్లాసిఫైడ్స్

EDUCATION

SPOT ADMISSIONS

■ B. Pharmacy, Pharm-D కోర్స్‌కి తక్కువ ఫీజుతో Management సీట్స్ (స్పాట్ అడ్మిషన్) కోసం సంప్ర: G. మురళి, 9030661651, ATP. [A-2779]

COACHING CENTER

■ 10th / ఇంటర్ ఫెయిల్ అయిన వారికి కోచింగ్ ఇవ్వబడును. హాస్టల్ కలదు. సంప్ర ॥ శేఖర్ కోచింగ్ సెంటర్, C/o. PRK జూనియర్ కాలేజ్ 3వ రోడ్డు, Opp. G.R. ఫంక్షన్ హాల్, ATP. 9440045441. [A-7378]

REAL ESTATE

అద్దెకు కావలెను

■ అనంతపూర్‌లోని తపోవనం సర్కిల్ నుండి రాప్తాడు సర్కిల్ వరకు మధ్య పెట్రోలు బంకు పెట్టుకొనుటకు 125 అ॥ పొడవు 125 అ॥ వెడల్పు గల స్థలం అద్దెకు కావలెను అద్దెతోపాటు అద్దె / భాగస్వామ్యం ఇవ్వబడును. నం॥ ✆ 924755 7178, 70932 89277 [O-759037]

SERVICES

■ రుణాలు, వ్యక్తిగత, వ్యవసాయం, వ్యాపార రుణం, తక్కువ వడ్డీ, సిబిల్ అవసరం లేదు, NPA కూడా ధరఖాస్తు చేసుకోవచ్చు, సిటికాపిటల్ సర్వీస్, విష్ణు,87690 57367. [T-222]

HEALTH CARE

■ PILES / FISSURES / FISTULA ఎటువంటి, పత్యం లేదు. ప్రతి రోజూ వాడవలసిన అవసరం లేదు.G.M.P & G.S.T., CERTIFIED.(Mrp.649/-) Contact: 8886099962. ATP. [A-1452]

WANTED

■ Wanted Warden and Qualified Maths, Physical Science Teachers to Teach VI to X in Little Flower English Medium School, ATP. Cell: 9949083624. [A-2776]

■ WANTED SERVICE MANAGER & SERVICE ADVISORS & TECHNICIANS. Contact : PMKR BIKES LLP, Ram Nagar Branch, ANANTAPURAM. Ph: 7382929555 [A-1455]

■ గోల్డెన్ ఇన్‌ఫ్రా ప్రాజెక్ట్ సంస్థలో పనిచేయుటకు మార్కెటింగ్ మేనేజర్ & ఎగ్జిక్యూటివ్, టెలికాలర్స్, ఆఫీస్‌బాయ్, డ్రైవర్స్ కావలెను. ఆకర్షణీయమైన జీతం + ఇన్సెంటివ్ కలవు. సెల్ : 9000336265, 9618595956. [A-1456]

■ JOB VACANCY: MAX PVT. LTD. Age: 18 to 45 yrs, Qul: 10th to Any Degree, Salary: 18000/- to 25000/- Contact: ✆ 7993007546. [T-778554]

■ Wanted Pastors / Evangelists to work in Christian Organisation Salary 25000. ✆ 8618178750 / 8639212257. [G-613]

■ SSC / ఇంటర్ (పాస్ / ఫెయిల్) అయిన 36 మంది స్త్రీ / పు లకు మా కంపెనీలో ఉద్యోగాలు జీతం: 14,000 + బోనస్ 6000 + ఫ్రీరూమ్ (నో ఫీజు) సంప్ర: సాయి నగర్, 1 వ క్రాస్ ATP: 97018 64175. [A-7375]

■ మా ఆఫీసు న్యూ ఫ్రాంచేజీ ద్వారా మీ ఖాళీ సమయంలో పార్ట్ టైమ్ / ఫుల్ టైమ్ గా వర్క్ చేస్తూ 15వేలు ఆపైన సంపాదించే అవకాశం. సంప్ర॥ 9177736926. [M-1167558]

■ త్రివేణి హోంకేర్ హైదరాబాద్ నందు వృద్ధులను, పేషెంట్స్‌ను చూసుకొనుటకు వర్కర్స్/నర్సులు కావలెను. ఫ్రీ వసతి + భోజనం. జీ: 18K. Ph: 9160900024/ 9640400073 [H-793666]

■ షిర్డీసాయి వృద్ధుల ఆశ్రమము హైదరాబాద్‌లో లేడీకేర్‌టేకర్స్, లేడీనర్సులు, కాంపౌండర్స్, ఆయాలు భార్యాభర్తలు కావలెను. ఫోన్: 9391036931, 9246585901. [HA-12583]

గమనిక

సాక్షి తెలుగు దినపత్రికలో రోజు ప్రచురించే క్లాసిఫైడ్ ప్రకటనలు చదివి, వాటిని నిశితంగా పరిశీలించిన పిదప ప్రతిస్పందించాల్సిందిగా మా పాఠకులను కోరడమైనది. ప్రకటనదారు తెలిపే లేదా క్లెయిమ్ చేసే వాటితో ఈ వార్తా పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

క్లుప్తంగా

జిల్లాకు కీర్తి తీసుకురావాలి



బంగారు పతకాలు సాధించిన చిన్నారులతో కలెక్టర్ గౌతమి

అనంతపురం అర్బన్: తైక్వాండో టోర్నమెంట్‌లో బంగారుపతకాలు సాధించిన చిన్నారులను కలెక్టర్ గౌతమి అభినందించారు. జాతీయస్థాయిలో విజయాలు సాధించి జిల్లాకు కీర్తి తీసుకురావాలని సూచించారు. చిన్నారులు బుధవారం కలెక్టరేట్‌లోని రెవెన్యూభవన్‌లో కలెక్టర్‌ను కలిశారు. టోర్నమెంట్ గురించి కలెక్టర్‌కు మాస్టర్ వినీత్ వివరించారు. ఈనెల 16,17 తేదీల్లో గుంటూరు జిల్లా రేపల్లెలో నిర్వహించిన రాష్ట్రస్థాయి తైక్వాండో టోర్నమెంట్‌లో గుత్తి ఆర్ఎస్ నుంచి 15 మంది చిన్నారులు పాల్గొన్నారని చెప్పారు. వీరిలో 12 మంది బంగారు పతకాలు సాధించారన్నారు. కార్యక్రమంలో హ్యూమన్ రైట్స్ చైర్మన్ ఉమర్ షరీఫ్, తదితరులు పాల్గొన్నారు.

బాక్సింగ్ పోటీల్లో ప్రతిభ



విద్యార్థినిని అభినందిస్తున్న ఉపాధ్యాయులు

ఆత్మకూరు: స్కూల్ గేమ్స్ ఫెడరేషన్‌కు సంబంధించి విజయనగరంలో ఇటీవల జరిగిన రాష్ట్రస్థాయి పోటీల్లో బి.యాలేరు ఉన్నత పాఠశాలకు చెందిన పదో తరగతి విద్యార్థిని అర్చన ప్రతిభ చూపినట్లు హెచ్ఎం వేణుగోపాల్, పీడీ సునీత తెలిపారు. రాష్ట్రస్థాయిలో మూడోస్థానంలో నిలిచిన అర్చనను ఉపాధ్యాయ బృందం, గ్రామస్తులు బుధవారం అభినందించారు.

వినియోగదారులు రసీదు తీసుకోవాలి



ప్రయాణికులకు అవగాహన కల్పిస్తున్న దృశ్యం

అనంతపురం సెంట్రల్: వస్తువులు కొనేటప్పుడు వినియోగదారులు తప్పనిసరిగా రసీదు తీసుకోవాలని వినియోగదారుల ఫోరం అధ్యక్షులు రవీంద్రారెడ్డి, ఆర్టీసీ డిపో మేనేజర్ నాగభూపాల్ సూచించారు. జాతీయ వినియోగదారుల వారోత్సవాలను పురస్కరించుకొని బుధవారం ఆర్టీసీ బస్టాండ్ ఆవరణంలో ప్రయాణికులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. నగరంలో సిటీ బస్సులు నడపాలని పలువురు ప్రజలు విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో ఫోరం కార్యదర్శి నబీ రసూల్, ఆర్టీసీ స్టేషన్ మేనేజర్ మూర్తి తదితరులు పాల్గొన్నారు.

క్యాలెండర్ ఆవిష్కరణ



నూతన క్యాలెండర్‌ను ఆవిష్కరిస్తున్న జిల్లా ప్రధాన న్యాయమూర్తి శ్రీనివాస్

అనంతపురం: ఏపీ జ్యుడీషియల్ ఎంప్లాయీస్ అసోసియేషన్ జిల్లా బ్రాంచ్, అనంతపురం 2024 నూతన సంవత్సర క్యాలెండర్‌ను జిల్లా ప్రధాన న్యాయమూర్తి శ్రీనివాస్ బుధవారం ఆవిష్కరించారు. కార్యక్రమంలో ఏపీ జ్యుడీషియల్ ఎంప్లాయీస్ అసోసియేషన్ జిల్లా ప్రెసిడెంట్ అశోక్ రెడ్డి, జనరల్ సెక్రెటరీ సి. మహేష్ కుమార్, ఆర్గనైజింగ్ సెక్రెటరీ శ్రీనివాస రెడ్డి, ట్రెజరర్ మహబూబ్ బాషా, సంపత్ కుమార్, వేణుగోపాల్, అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్స్ భాగ్యలక్ష్మీ, మురళీధర్, భాస్కర్, ప్రభాకర్, ఆదినారాయణ, కేబీఎల్ఎస్ రావు, చంద్రశేఖర్ రెడ్డి, నగేష్, వేణుగోపాల్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పీహెచ్‌సీ తనిఖీ



పీహెచ్‌సీలో రికార్డులు పరిశీలిస్తున్న డీఐఓ కృష్ణయ్య

కనగానపల్లి: మండల కేంద్రంలోని పీహెచ్‌సీని డీఐఓ (జిల్లా ఇమ్యూనైజేషన్ అధికారి) డాక్టర్ కృష్ణయ్య బుధవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆరోగ్య కేంద్రంలోని రికార్డులు పరిశీలించి వైద్య సేవలపై ఆరా తీశారు. అనంతరం ఆరోగ్య సిబ్బందితో సమావేశమై ఐఎంఐ, సాస్ కార్యక్రమాల పురోగతిపై చర్చించారు. కార్యక్రమంలో పీహెచ్‌సీ డాక్టర్లు చెన్నారెడ్డి, ప్రశాంత్, హెల్త్‌సూపర్‌వైజర్ శ్రీనివాసులు, ఆరోగ్య కార్యకర్తలు పాల్గొన్నారు.

పేదలకు కార్పొరేట్ వైద్యం

- 'ఆరోగ్యశ్రీ' పరిమితి రూ.25 లక్షలకు పెంపు
- ఎమ్మెల్యే అనంత వెంకటరామిరెడ్డి



ఆరోగ్య శ్రీ స్మార్ట్ కార్డులు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే అనంత వెంకటరామిరెడ్డి

అనంతపురం కార్పొరేషన్: పేద, సామాన్య మధ్య తరగతి ప్రజలకు కార్పొరేట్ స్థాయి వైద్యాన్ని అందించేందుకు రూ.5 లక్షలున్న ఆరోగ్య శ్రీ వైద్య చికిత్సల పరిమితిని రూ.25 లక్షలు చేసిన మానవతావాది సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి అని ఎమ్మెల్యే అనంత వెంకటరామిరెడ్డి పేర్కొన్నారు. బుధవారం రెండో రోడ్డులోని వైఎస్సార్ పట్టణ ఆరోగ్య కేంద్రం వద్ద ఆరోగ్యశాఖ ఆధ్వర్యంలో ఆరోగ్య శ్రీ స్మార్ట్ కార్డుల పంపిణీ కార్యక్రమం జరిగింది. ముఖ్య అతిథిగా పాల్గొన్న ఎమ్మెల్యే అనంత వెంకటరామిరెడ్డి మాట్లాడుతూ ప్రధాని నరేంద్ర మోదీ కూడా ఇవ్వలేని గొప్ప సదుపాయాన్ని ఏపీ ప్రజలకు సీఎం కల్పించారన్నారు. డాక్టర్ వైఎస్సార్ ఆరోగ్య శ్రీ పథకం పేదల పాలిట సంజీవని అన్నారు. దివంగత ముఖ్యమంత్రి వైఎస్సార్ పేద ప్రజలకు కార్పొరేట్ వైద్యం అందించాలని ఆరోగ్యశ్రీని ప్రవేశపెడితే, ఆయన తనయుడు సీఎం వైఎస్ జగన్ వైఎస్సార్ కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పాటయ్యాక రూ.3 లక్షలున్న ఆరోగ్య శ్రీ పరిమితిని రూ.5 లక్షలు చేశారన్నారు. పేద, సామాన్య మధ్యతరగతి ప్రజలకు మరింత ఖరీదైన వైద్యాన్ని అందించేందుకు తాజాగా రూ.25 లక్షలు చేశారన్నారు. కర్ణాటకలోని బెంగళూరు, తమిళనాడులోని చెన్నై, తెలంగాణలోని హైదరాబాద్ ప్రాంతాల్లోనూ ఆరోగ్య శ్రీ కింద ఉచితంగా సేవలందించేలా ప్రభుత్వం చర్యలు తీసుకుందన్నారు. అనంతపురంలోని 43 నెట్‌వర్క్ ఆస్పత్రుల్లో సదుపాయం ఉన్నట్లు తెలిపారు. హైదరాబాద్‌లో 85, చెన్నైలో 16, బెంగళూరులో 35 ఆస్పత్రుల్లో ఆరోగ్య శ్రీ కింద సేవలు (మొత్తం 204 ఆస్పత్రులు) పొందవచ్చన్నారు. ప్రస్తుత రోజుల్లో గుండె, కేన్సర్, కిడ్నీ, తలసేమియా, బ్రౌన్ మ్యారో ట్రాన్స్‌ప్లాంటేషన్, న్యూరో సర్జరీలకు రూ.3 లక్షల నుంచి రూ.6 లక్షల వరకు ఖర్చు అవుతుందని అటువంటి ఖరీదైన జబ్బులకు ఉచితంగా సేవలందించనున్నారన్నారు. గడిచిన నాలుగున్నరేళ్లలో ప్రభుత్వం ఆరోగ్య శ్రీ కోసం రూ.14,439 కోట్లు ఖర్చు చేసిన విషయాన్ని గుర్తు చేశారు. బోధనాస్పత్రులను బలోపేతం చేయడంతో పాటు రానున్న రోజుల్లో మరో 10 వైద్య కళాశాలను ప్రవేశపెడుతున్నట్లు తెలిపారు. సంక్రాంతిలోపు అందరికీ ఆరోగ్య శ్రీ కార్డుల పంపిణీ జరుగుతుందన్నారు. మేయర్ వసీం మాట్లాడుతూ జిల్లా కేంద్రంలో నాడు-నేడు కింద రూ.300 కోట్లతో సర్జికల్, ఎంసీహెచ్ బ్లాక్ ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో డీఎంహెచ్ఓ డాక్టర్ ఈ భ్రమరాంబ దేవి, ఆరోగ్య శ్రీ డీసీ కిరణ్‌కుమార్ రెడ్డి, డిప్యూటీ మేయర్లు కోగటం విజయభాస్కర్ రెడ్డి, వాసంతి సాహిత్య, మార్కెట్‌యార్డు చైర్మన్ ఫయాజ్, వక్ఫ్ బోర్డు జిల్లా చైర్మన్ కాగజ్‌ఘర్ రిజ్వాన్, కార్పొరేటర్లు శాంతిసుధ, ఇసాక్, టీవీ చంద్రమోహన్ రెడ్డి, శేఖర్‌బాబు, బాలాంజినేయులు, పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి కొండ్రెడ్డి ప్రకాష్‌రెడ్డి, అనుబంధ సంఘాల అధ్యక్షులు ఉమ్మడి మదన్‌మోహన్‌రెడ్డి, సైఫుల్లాబేగ్, శ్రీదేవి, పార్టీ నగరాధ్యక్షురాలు కృష్ణవేణి, జేసీఎస్ కన్వీనర్లు వీరా రామకృష్ణా రెడ్డి, చింతకుంట మధు, తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా ముందస్తు క్రిస్మస్

ఆత్మకూరు: స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో బుధవారం ముందస్తు క్రిస్మస్ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఎంపీపీ చాంబర్‌లో మండల కేంద్రంలోని హోలిస్పిరిట్ పాఠశాల సిబ్బందితో కలసి ఎంపీపీ హేమలత కేక్ కట్ చేశారు. ఈ సందర్భంగా యేసుక్రీస్తు గురించి పలు విషయాలను తెలియజేశారు. కార్యక్రమంలో ఎంపీడీఓ రఘునాథ్, జయరామ్, భరత్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా ఫ్రీ క్రిస్మస్

అనంతపురం కల్చరల్: నగరంలో బుధవారం సాయిట్రస్టు ఆధ్వర్యంలో ఫ్రీ క్రిస్మస్ వేడుకలు ఘనంగా నిర్వహించారు. బిగ్ బాస్ షో రన్నరప్ అమరదీప్ చేతులమీదుగా పలు అనాథ, వృద్ధాశ్రమాలకు నిత్యావసర వస్తువులు, వస్త్రాలు, దుప్పట్లను వితరణ చేశారు. లెప్రసీ కాలనీలో అనాథ చిన్నారుల మధ్య జరిగిన వేడుకల్లో ఆటపాటల్లో అమరదీప్ పాల్గొన్నారు. మతం కన్నా మానవత్వం ముఖ్యమని, చిన్నారులు కుల మతాలకతీతంగా ఎదగాలని సూచించారు. అనంతరం కేక్ కట్ చేసి అందరితో ఆనందాలను పంచుకున్నారు. కార్యక్రమంలో ట్రస్టు అధ్యక్షుడు విజయ్‌కుమార్, ప్రవీన్, రాఘవేంద్ర, నారాయణ తదితరులు పాల్గొన్నారు.

ముక్కోటి అంబికా సేవ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో..

అనంతపురం రూరల్: అనంతపురం కళ్యాణదుర్గం రోడ్డు ఎబినేజర్ పెంతుకోస్తు చర్చిలో బుధవారం ముక్కోటి అంబికా సేవ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో క్రిస్మస్ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా చైర్మన్ దంపెట్ల శివ కేక చేసి 22 మంది పాస్టర్లకు వస్త్ర దానంతో పాటు ఆర్థిక సహాయం అందజేశారు. కార్యక్రమంలో ట్రస్టీ లావణ్య మాధురి, ట్రస్ట్ కోఆర్డినేటర్ రామంజి, పాస్టర్ జేమ్స్ పాల్ నాయక్, పాస్టర్ జాషువా తదితరులు పాల్గొన్నారు.



విద్యార్థులతో కలిసి కేక్ కట్ చేస్తున్న డిప్యూటీ మేయర్ కోగటం



వైఎస్సార్ సీపీ కార్యాలయం వద్ద కేక్ కట్ చేస్తున్న పైలా నర్సింహయ్య, మాల్యవంతం మంజుల, నాయకులు

హ్యాపీ బర్త్ డే సీఎం సార్

నగరంలో పలు చోట్ల బుధవారం సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి జన్మదిన వేడుకలు ఘనంగా నిర్వహించారు. కేక్ కట్ చేసి పంచిపెట్టారు. జై జగన్ అంటూ నినదించారు. ముందస్తుగా నిర్వహించిన వేడుకల్లో పెద్ద సంఖ్యలో వైఎస్సార్ సీపీ నాయకులు, అభిమానులు పాల్గొన్నారు.

– సాక్షి బృందం



26వ డివిజన్‌లో కార్పొరేటర్ మీనాక్షి ఆధ్వర్యంలో సీఎం జన్మదినోత్సవం

అలరించిన ఉర్దూ గజల్ గీతాలు



ఖవ్వాలి కార్యక్రమంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే అనంత వెంకటరామిరెడ్డి, చిత్రంలో నదీం, మహాలక్ష్మి, వసీం తదితరులు

అనంతపురం కల్చరల్: వివిధ రాష్ట్రాల నుంచి విచ్చేసిన గజల్ గాయకులు ఉర్దూ సంగీత కార్యక్రమాన్ని వీనుల విందుగా వినిపించి ఆకట్టుకున్నారు. సీఎం వైఎస్ జగన్ జన్మదిన వేడుకల్లో భాగంగా రాష్ట్ర ఉర్దూ అకాడమీ ఆధ్వర్యంలో బుధవారం రాత్రి జెడ్పీ కార్యాలయం సమీపంలోని అంబేడ్కర్ విగ్రహం వద్ద 'మెహఫిల్ ఏ గజల్' ఖవ్వాలి ఆద్యంతం ఆసక్తికరంగా జరిగింది. ప్రపంచ ప్రఖ్యాతి ఖవ్వాల్ జనాబ్ హంసర్ హయాత్, మజహర్ హయత్, ఢిల్లీ నుంచి రేడియో టీవీ సింగర్స్ నిజామీ సోదర బృందం, మహారాష్ట్ర నుంచి ఫైసల్ ఖాద్రి ఖవ్వాల్ తదితరులు అనంత వాసులను మంత్రముగ్ధులను చేశారు. అంతకు ముందు జరిగిన సమావేశంలో ఆత్మీయ అతిథులుగా విచ్చేసిన ఎమ్మెల్యే అనంత వెంకటరామిరెడ్డి, ఉర్దూ అకాడమీ చైర్మన్ నదీం అహ్మద్, మేయర్ వసీం, అహుడా చైర్మన్ మహాలక్ష్మి శ్రీనివాస్, డిప్యూటీ మేయర్లు కోగటం విజయభాస్కరరెడ్డి, వాసంతి సాహిత్య, మైనార్టీ కమిషన్ మెంబర్ హిదయతుల్లా, జిల్లా వక్ఫ్‌బోర్డు చైర్మన్ రిజ్వాన్ మాట్లాడారు. కార్యక్రమంలో నంద్యాల జేసీఎస్ కోఆర్డినేటర్ బాబూలాల్, మైన్స్ అండ్ మినరల్స్ కార్పొరేషన్ చైర్‌పర్సన్ షమీం అస్లాం, వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు పైలా నరసింహయ్య, జిల్లా వక్ఫ్‌బోర్డు చైర్మన్ రిజ్వాన్, ఉర్దూ అకాడమీ బోర్డు ఆఫ్ గవర్నర్స్ షుకూర్‌సాబ్, వైఎస్సార్‌సీపీ మైనార్టీ విభాగం అధ్యక్షుడు సైఫుల్లాబేగ్, మైనార్టీ వెల్ఫేర్ మెంబర్ గౌస్‌బేగ్, కార్పొరేటర్ బాబా ఫకృద్దీన్ తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు పనులకు నేడు భూమిపూజ

రామగిరి: మండలంలోని సుద్దకుంటపల్లిలో గురువారం రాప్తాడు ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి పర్యటిస్తారని వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ కత్రా హనుమంతరెడ్డి ఓ ప్రకటనలో తెలిపారు. కుంటిమద్ది నుంచి సుద్దకుంటపల్లి రోడ్డు పనులకు భూమి పూజ చేస్తారన్నారు. ఈ కార్యక్రమానికి వైఎస్సార్‌సీపీ నాయకులు , కార్యకర్తలు హాజరుకావాలని విజ్ఞప్తి చేశారు.

అనారోగ్యంతో మాజీ ఎంపీపీ మృతి



ఆదినారాయణరెడ్డి (ఫైల్)

చెన్నేకొత్తపల్లి: మండల పరిషత్ మాజీ అధ్యక్షుడు సానే ఆదినారాయణరెడ్డి (80) అనారోగ్యంతో బుధవారం మృతి చెందారు. ఆయన స్వగ్రామం కనుముక్కలలో అంత్యక్రియలు నిర్వహించారు. సానే ఆదినారాయణరెడ్డి చెన్నేకొత్తపల్లి ఎంపీపీగా 1987 నుంచి 1992 వరకు పనిచేశారు. పెనుకొండ మాజీ ఎమ్మెల్యే సానే చెన్నారెడ్డికి ఆయన స్వయానా సోదరుడు. ఆదినారాయణరెడ్డి మృతి చెందిన విషయం తెలుసుకున్న వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకుడు తోపుదుర్తి ఆత్మారామిరెడ్డి, జెడ్పీటీసీ గోవిందరెడ్డి, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ నర్సిరెడ్డి, నాయకులు సానే జయరామిరెడ్డి, సానే రాజారెడ్డి, సానే ఉమారాణి కనుముక్కలకు చేరుకొని ఆదినారాయణరెడ్డి భౌతికకాయం వద్ద ఘనంగా నివాళులర్పించారు.

వాల్‌పోస్టర్ల విడుదల



అనంతపురం: సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి జన్మదిన వేడుకల సందర్భంగా జిల్లా కేంద్ర గ్రంథాలయంలో బుధవారం వాల్‌పోస్టర్లు విడుదల చేశారు. కార్యక్రమంలో జిల్లా కేంద్ర గ్రంథాలయ సంస్థ చైర్‌పర్సన్ ఎల్ఎం ఉమామోహన్ రెడ్డి, మాజీ గ్రంథాలయ సంస్థ అధ్యక్షుడు ఎల్ఎం మోహన్ రెడ్డి, వైఎస్సార్ సీపీ నాయకులు విష్ణువర్ధన్ రెడ్డి, వైఎస్సార్ సీపీ జిల్లా అధికార ప్రతినిధి ఎన్‌సీ బాల నరసింహారెడ్డి, సతీష్ నారాయణ, సిబ్బంది ఉన్నారు.

నేడు వైఎస్సార్ విగ్రహావిష్కరణ

అనంతపురం రూరల్: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి జన్మదినవేడుకలను పురస్కరించుకుని రుద్రంపేట పంచాయతీ విమల ఫరూక్ నగర్ సర్కిల్‌లో గురువారం దివంగత నేత వైఎస్ రాజశేఖర రెడ్డి విగ్రహాన్ని ఆవిష్కరిస్తున్నట్లు వైఎస్సార్‌సీపీ మైనార్టీ విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, ఎంఎస్ఎస్ సేవా సంస్థ అధ్యక్షులు సాదిక్ వలి తెలిపారు. ముఖ్య అతిథులుగా ఎమ్మెల్యే అనంత వెంకట్రామిరెడ్డి, జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ బోయగిరిజమ్మ, ప్రజాప్రతినిధులు హాజరవుతారని, జయప్రదం చేయాలని కోరారు.

దోచుకుంది.. దాచుకుంది టీడీపీ వాళ్లే

- హౌసింగ్, భూ దందా జరిగింది టీడీపీ హయాంలోనే
- పచ్చకుట్రపై మండిపడ్డ వైఎస్సార్‌సీపీ నాయకులు

రామగిరి: దోచుకుంది... దాచుకుంది టీడీపీ వాళ్లే.. హౌసింగ్, భూదందాలతో రూ.కోట్లను జేబులు నింపుకున్నారని ఎంపీపీ మీనుగ నాగమ్మ, జెడ్పీటీసీ నాగార్జున, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ కత్రా హనుమంతరెడ్డి, సింగిల్‌విండో ప్రెసిడెంట్ హెచ్ఎస్ ముత్యాలు తెలిపారు. బుధవారం మండల కేంద్రమైన రామగిరిలో వారు విలేకరుల సమావేశంలో మాట్లాడారు. బుధవారం ఓ పత్రికలో భూదందాలో వైసీపీ గద్దలు అనే పేరుతో అసత్య కథనాన్ని ప్రచురించారన్నారు. వైఎస్సార్‌సీపీ నాయకులపై వచ్చిన ఆరోపణలు అవాస్తవమని స్పష్టం చేశారు. కొన్నేళ్లుగా ఈ ప్రాంతం పరిటాల కుటుంబ ఆధీనంలో ఉందని, వారు చెప్పిందే వేదంగా జరుగుతూ వచ్చిందన్నారు. అధికారులను, ప్రజలను తీవ్ర ఇబ్బందులకు గురిచేసింది నిజం కాదా ? అని ప్రశ్నించారు. గతంలో అప్పటి ఎమ్మెల్యే పరిటాల సునీత తమ అనుచరులతో కలసి హౌసింగ్ నిర్మాణాల్లో నసనకోట, ఎంసీపల్లి పంచాయతీల్లో లక్షల్లో అవినీతి చేశారని విమర్శించారు. గత టీడీపీ ప్రభుత్వ హయాంలో భూదందాలతో పాటు ఇసుక అక్రమ రవాణా, నీరు-చెట్టులో దోచుకుంది.. దాచుకుంది ప్రజలందరికీ తెలుసన్నారు. ఒక్కసారిగా అధికారం కోల్పోవడంతో మతిభ్రమించి మాట్లాడుతున్నారన్నారు. వీళ్ల ఆగడాలకు భయపడి రామగిరి మండలానికి అధికారులు రావాలంటేనే భయపడే పరిస్థితి నెలకొందంటే వీళ్ల అవినీతి ఏస్థాయిలో జరిగిందో అర్థం చేసుకోవచ్చని తెలిపారు. ఎన్నికల సమయంలో మాత్రం గ్రామాల్లో పర్యటించి అదిచేస్తాం... ఇది చేస్తాం అంటూ ప్రజలను మభ్యపెడుతూ ఆ తర్వాత మాయమవుతారన్నారు . రాష్ట్రంలో వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక రాప్తాడు నియోజకవర్గ అభివృద్ధికి ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి కృషి చేస్తున్నారన్నారు. ముఖ్యంగా అన్నిచెరువులకు నీటిని అందించడంతో పాటు పేరూరు డ్యాంకు హంద్రీనీవా నీటిని తెచ్చిన ఘనత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వానికే దక్కుతుందన్నారు. ఇప్పటికైనా అసత్య ఆరోపణలుమాని ప్రజలకు సేవచేయాలని, లేకుంటే ప్రజలే తగిన గుణపాఠం చెబుతారన్నారు. రాబోయే ఎన్నికల్లో మీరెన్ని కుట్రలు పన్నినా ప్రజలందరూ వైఎస్సార్‌సీపీకే పట్టంకడతారని స్పష్టం చేశారు. కార్యక్రమంలో సర్పంచ్‌లు మీనుగ నాగరాజు, నరేంద్ర, రాజేష్, సిద్దన్న, రామ్మూర్తి, చెన్నకేశవరెడ్డి, నాయకులు జయచంద్రారెడ్డి, ఓబిరెడ్డి, ఆదిరెడ్డి, నరసింహారెడ్డి, సూరి, రామాంజినేయులు తదితరులు పాల్గొన్నారు.

మంచి చేస్తున్న ప్రభుత్వానికి అండగా నిలవాలి





కేక్ కట్ చేసి చిన్నారులకు తినిపిస్తున్న ఎమ్మెల్యే అనంత, కార్యక్రమానికి హాజరైన మహిళలు

అనంతపురం కార్పొరేషన్: రాష్ట్ర ముఖ్యమంత్రిగా సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ఉన్నంత వరకు సంక్షేమం ఆగదని, మంచి చేస్తున్న ప్రభుత్వానికి అండగా నిలవాలని ప్రజలకు ఎమ్మెల్యే అనంత వెంకటరామిరెడ్డి పిలుపునిచ్చారు. బుధవారం 49వ డివిజన్‌లోని 71వ సచివాలయ పరిధిలో 'వై ఏపీ నీడ్స్ జగన్' కార్యక్రమాన్ని నిర్వహించారు. సంక్షేమ, అభివృద్ధి బోర్డు, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ జెండాను ఎమ్మెల్యే ఆవిష్కరించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ 14 ఏళ్ల పాటు సీఎంగా పని చేసిన చంద్రబాబు ప్రజలకేం చేయలేదని, నాలుగున్నరేళ్లలో సీఎం వైఎస్ జగన్ ఊహకందని రీతిలో సంక్షేమం, అభివృద్ధిని ప్రజలకు అందించారన్నారు. ఆయన పేదల పక్షపాతి అని అన్నారు. ప్రజలకు మోసం చేసే వాళ్లు మంచోళ్లు.. మంచి చేసే వారు చెడ్డోళ్లుగా ప్రతిపక్షాలు, ఎల్లో మీడియా దుష్ప్రచారం చేస్తున్నాయన్నారు. ఎవరి పాలనలో ప్రజలకు మేలు జరిగిందో ఆలోచించాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. తమ ప్రభుత్వంలో రూ.800 కోట్ల అభివృద్ధి జరిగిందని, అందుకు మీరే సాక్ష్యం అని అన్నారు. అనంతరం సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి పుట్టిన రోజు సందర్భంగా ఎమ్మెల్యే అనంత వెంకటరామి రెడ్డి కేక్ కట్ చేసి పార్టీ శ్రేణులకు పంచారు. కార్యక్రమంలో మేయర్ వసీం, డిప్యూటీ మేయర్లు కోగటం విజయభాస్కర్ రెడ్డి, వాసంతి సాహిత్య, కార్పొరేటర్లు మునిశేఖర్, శేఖర్‌బాబు, పార్టీ నగర నేత చింతా సోమశేఖర్ రెడ్డి, పార్టీ జిల్లా కార్యదర్శి రాధాకృష్ణ, నాయకులు సుజాత, రామలింగం, రాంరెడ్డి, అనిల్‌కుమార్‌గౌడ్, సచివాలయ కన్వీనర్లు షాబమ్మ, భానుమతి పాల్గొన్నారు.

30 ఏళ్లుగా లేని అభివృద్ధి జరిగింది

రాప్తాడురూరల్: అనంతపురం రూరల్ మండలం కక్కలకాలనీ పంచాయతీలో గత 30 ఏళ్లుగా లేని అభివృద్ధి ప్రస్తుత ప్రభుత్వ హయాంలో జరిగిందని ఎంపీపీ వరలక్ష్మీ, జెడ్పీటీసీ సభ్యుడు జూటూరు చంద్రకుమార్, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ రాధమ్మ, బీసీ సెల్ రాష్ట్ర కార్యదర్శి కె.ధనుంజయాదవ్ తెలిపారు. కక్కలపల్లి కాలనీ పంచాయతీ 1వ సచివాలయం పరిధిలోని పిల్లిగుండ్లకాలనీలో బుధవారం 'వై ఏపీ నీడ్స్ జగన్' కార్యక్రమాన్ని నిర్వహించారు. పార్టీ జెండాను ఆవిష్కరించారు. అనంతరం సచివాలయ పరిధిలో వివిధ సంక్షేమ పథకాల ద్వారా లబ్ధి చేకూరిన రూ. 18.60 కోట్లకు సంబంధించిన డిజిటల్ బోర్డును ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పరిటాల కుటుంబ సభ్యులు మంత్రులుగా, ఎమ్మెల్యేలుగా పని చేసినా ఈ ప్రాంతం అభివృద్ధి కాలేదన్నారు. కనీసం ప్రధాన రోడ్లు కూడా నిర్మాణానికి నోచుకోలేదన్నారు. తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి ఎమ్మెల్యే అయిన తర్వాత ఏ వీధి చూసినా రోడ్లు, కాలువలు పూర్తయ్యాయన్నారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డిని మరోమారు దీవించాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో ఉప సర్పంచ్ ఇమాంబి, ఎంపీటీసీ సభ్యుడు సందీప్‌యాదవ్, మాజీ ఉప సర్పంచ్ నాగరాజు, నాయకులు ఆకుల మునిశంకరయ్య, ఎర్రిస్వామి, ఈశ్వరయ్య, రమేష్, వార్డు మెంబర్లు గఫూర్, ముస్తాక్, సుకుమార్ పాల్గొన్నారు.



నినాదాలు చేస్తున్న ప్రజాప్రతినిధులు, నాయకులు

సీఎం జగన్‌తోనే మైనార్టీ సంక్షేమం

అనంతపురం కల్చరల్: సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డితోనే మైనార్టీల సంక్షేమం సాధ్యమైందని ఎమ్మెల్యే అనంత వెంకటరామిరెడ్డి అన్నారు. సీఎం జన్మదిన వేడుకల సందర్భంగా రాష్ట్ర ఉర్దూ అకాడమీ ఆధ్వర్యంలో బుధవారం రాత్రి స్థానిక రఘువీరా టవర్స్‌లో అడ్వాన్స్ కంప్యూటర్ శిక్షణా కేంద్రం ప్రారంభమైంది. ఎమ్మెల్యే అనంత వెంకటరామిరెడ్డి, ఉర్దూ అకాడమీ చైర్మన్ నదీం అహ్మద్, మేయర్ వాసీం, మైనార్టీ కమిషన్ మెంబర్ హిదయతుల్లా, నంద్యాల జేసీఎస్ కోఆర్డినేటర్ బాబూలాల్, మైన్స్ అండ్ మినరల్స్ కార్పొరేషన్ చైర్‌పర్సన్ షమీం అస్లాం, జిల్లా వక్ఫ్‌బోర్డు చైర్మన్ రిజ్వాన్ హాజరై మాట్లాడారు. వచ్చే నెల 1 నుంచి ప్రత్యేక శిక్షణ ఇస్తారన్నారు. దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర రెడ్డి ముస్లింలకు ప్రత్యేక రిజర్వేషన్లు కల్పించి, వారి అభ్యున్నతికి బాటలు పరిచారన్నారు. కార్యక్రమంలో అహూడా చైర్మన్ మహాలక్ష్మి శ్రీనివాస్, డిప్యూటీ మేయర్లు కోగటం విజయభాస్కరరెడ్డి, వాసంతి సాహిత్య, ఉర్దూ అకాడమీ బోర్డు ఆఫ్ గవర్నర్స్ షుకూర్‌సాబ్, ఖాసీంసాబ్, నూరుల్లా ఖాద్రి, బాజీ వలి, మూర్తుజ, డైరెక్టర్ సెక్రటరీ మస్తాన్ వలి, వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు పైలా నరసింహయ్య, మైనార్టీ విభాగం అధ్యక్షుడు సైఫుల్లాబేగ్, మైనార్టీ వెల్ఫేర్ మెంబర్ గౌస్‌బేగ్, కార్పొరేటర్ బాబా ఫకృద్దీన్ తదితరులు పాల్గొన్నారు.

ప్రజారోగ్యమే ప్రభుత్వ లక్ష్యం



కార్డులు పంపిణీ చేస్తున్న అధికారులు, నాయకులు

రాప్తాడు: ప్రజారోగ్యమే ప్రభుత్వ లక్ష్యమని ఎంపీడీఓ సాల్మన్ అన్నారు. బుధవారం మండల కేంద్రం రాప్తాడులో స్థానిక ఎంపీడీఓ కార్యాలయం దగ్గర మండలంలో నూతనంగా మంజూరైన ఆరోగ్య శ్రీ కార్డులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ మాట్లాడుతూ రాష్ట్రంలో సీఎం జగన్‌మోహన్ రెడ్డి విప్లవాత్మక పరిపాలన కొనసాగిస్తున్నారని చెప్పారు. విద్య, వైద్యాభివృద్ధికి పెద్ద పీట వేస్తున్నారన్నారు. ఆరోగ్య శ్రీ పరిమితిని రూ.25 లక్షల వరకు పెంచడంతో పేదలకు కార్పొరేట్ వైద్యాన్ని దరిచేర్చారన్నారు. దేశంలో ఏ రాష్ట్రంలో లేని విధంగా మన రాష్ట్రంలో ఆరోగ్య శ్రీ పథకం అమలు జరుగుతోందన్నారు. కార్యక్రమంలో హెల్త్ సూపర్ వైజర్ అరుణమ్మ, ల్యాబ్ టెక్నీషియన్ శ్రీధర్, ఏఎన్ఎం అనిత, మండల ఎన్నికల ఇన్‌చార్జి చిట్రెడ్డి సత్యనారాయణరెడ్డి, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ జూటూరు శేఖర్, మరూరు సొసైటీ అధ్యక్షుడు మాచిరెడ్డి కొండారెడ్డి, బీసీ సెల్ నాయకులు చిట్రా వెంకటేష్, పసుపుల ఆది, పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో మహాపడి పూజ



పడిపూజ నిర్వహిస్తున్న మాలధారులు

అనంతపురం కల్చరల్: స్వామియే శరణం అయ్యప్ప శరణు ఘోషతో ఆలయ పరిసరాలు ప్రతిధ్వనించాయి. బుధవారం నగరంలోని హరిహర దేవాలయంలో రాత్రి పొద్దు పోయే వరకూ మహా పడిపూజలు ఘనంగా జరిగాయి. శబరిమల సన్నిధానం నుంచి మునేమేల్ బ్రహ్మశ్రీ దామోదరన్ పొట్టిస్వామి అనంతకు విశిష్ట అతిథిగా విచ్చేసి కేరళ సంప్రదాయపద్ధతుల్లో అయ్యప్ప 18 మెట్లకు ప్రత్యేక అలంకార సేవల్లో పూజలు నిర్వహించారు. 36 కలశాలు, వేర్వేరు ప్రాంతాల నుంచి తెప్పించిన పుష్పాలతో అధిక సంఖ్యలో తరలి వచ్చిన అయ్యప్ప మాలధారులతో మహాపడిపూజలు జరిగాయి. అనంతరం వివిధ రకాల హారతులు, భిక్ష కార్యక్రమం జరిగింది. ఆలయ కమిటీ సభ్యులు ఫణిరాజ్, రవీంద్రగుప్తా, సుకుమార్, శివ ప్రవీణ్, అయ్యప్ప అన్నదాన సమితి నిర్వాహకులు ఆకుల రాఘవేంద్ర, రాజారమేష్, మణికంఠ తదితరులున్నారు.

ముగిసిన అయ్యప్ప బ్రహ్మోత్సవాలు

వారం రోజులుగా సందడిగా సాగిన నగరంలోని మొదటి రోడ్డు కాశీవిశ్వేశ్వరాలయంలో కొలువైన హరిహరపుత్ర అయ్యప్పస్వామి బ్రహ్మోత్సవాలు బుధవారం ఘనంగా ముగిశాయి. చివరిరోజు అయ్యప్ప స్వామికి చక్రస్నాన వేడుకలు నిర్వహించారు. కేరళ పద్ధతులననుసరిస్తూ పంపనూరు వద్ద ఆరాట్టు పేరుతో జలాభిషేకాలు నిర్వహించారు. తరలివచ్చిన అయ్యప్ప స్వాముల భజనలు, భక్తిసంకీర్తనల నడుమ ప్రత్యేక అభిషేకాలు, అలంకార సేవల చేసి వేడుకలు ఘనంగా ముగిసినట్టు అర్చకులు ప్రకటించారు. కార్యక్రమంలో గురుస్వాములు లక్ష్మీరెడ్డి, శ్రీనివాసులు, ఈఓ రమేష్‌బాబు, ధర్మకర్తల మండలి సభ్యులు సురేష్, చంద్ర, తిమ్మారెడ్డి, వెంకటస్వామి, సుబ్రమణ్యం తదితరులు పాల్గొన్నారు.

సాక్షి దినపత్రికలో ప్రకటనల కోసం మీ ప్రాంతంలో మా ప్రతినిధులు అందుబాటులో ఉన్నారు.
వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు
వ్యాపార, ఉద్యోగ, బహిరంగ ప్రకటనలు
శ్రద్ధాంజలి, నిర్యాణము, వర్ధంతి మొదలగు
అన్ని రకాల ప్రకటనలు ఇవ్వదలిచిన వారు సంప్రదించండి.
అనంతపురము డివిజన్
9912220719, 9912220732, 9912220724, 9010223702, 9010567770, 9010588846, 9912220727